


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250



Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 134 విశాఖపట్నం, 01 మార్చి 2026 ఆదివారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00




## రూ.5,456 కోట్ల వార్షిక బడ్జెట్‌కు తితిదే ధర్మకర్తల మండలి ఆమోదం

**తిరుమల, విశాఖ సమాచారమ్, మార్చి 1 :** తిరుపతిలోని వకుళమాత ఆలయంలో గోవింద అక్షరమాల కార్యక్రమాన్ని ప్రారంభించాలని తితిదే నిర్ణయించింది. ఒంటిమిట్టలో 108 అడుగుల ఎత్తయిన జాంబవంతుడి విగ్రహ ఏర్పాటుకు రూ. 20.17 కోట్లతో పనులు చేపట్టేందుకు తితిదే ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రూ. 5,456 కోట్ల తితిదే వార్షిక బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. వార్షిక బడ్జెట్‌తోపాటు పలు కీలక అంశాలపై బోర్డు చర్చించింది. ⏭ తరువాయి 2లో..

# సామర్లకోట బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు



**18 మంది మృతి**

**సామర్లకోట, విశాఖ సమాచారమ్ మార్చి :**

కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. మండలంలోని వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున మిగతా 2లో

## వేట్లపాలెంలో పేలుడు సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



**సామర్లకోట:** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో సంభవించిన పేలుడు ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. పేలుడు ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. బాధితులకు అవసరమైన ⏭ తరువాయి 2లో..

## ఏపీలో నమో అంటే.. నాయుడు, మోదీ

### నారా లోకేశ్



**అనకాపల్లి, విశాఖ సమాచారమ్, మార్చి 1 :** కేంద్రంలో నరేంద్ర మోదీ.. ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం ఇండస్ట్రియల్ పార్కులో బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ పరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆ సంస్థ ఫార్మాస్యూటికల్ ఇంటర్మీడియట్లు, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ. 2,300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 1,750 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. "ఏపీకి బ్లూజెట్ సంస్థ రావడం శుభసూచికం. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు కాదు.. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు నడుస్తోంది. నమో అంటే నరేంద్ర మోదీ అని అందరికీ తెలుసు. ఏపీలో నమో అంటే.. నాయుడు, మోదీ అని అంటారు" అని లోకేశ్ పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం



**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ టీకా పంపిణీ కార్యక్రమం చేపట్టింది. దేశ వ్యాప్తంగా 14 నుంచి 15 ఏళ్ల బాలికలకు దీనిని ఇస్తున్నారు. రాజస్థాన్‌లో ప్రధాని మోదీ జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ కార్యక్రమం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో తెలంగాణ మంత్రి దామోదర రాజ నరసింహ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీలోని విజయనగరం జిల్లా చీపురుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యాక్రమ్యంలో ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు పాల్గొని వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు.




## జనసేన కార్యాలయంలో ఘటన
### భద్రతాసిబ్బందిపై చర్యలు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 1 :** మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలోకి ఓ వ్యక్తి చొరబడి కార్లు ధ్వంసం చేసిన ఘటనలో అధికారులు చర్యలు చేపట్టారు. భద్రతా విభాగం నుంచి ఐదుగురిని మాతృశాఖకు పంపారు. రిజర్వ్ ఇన్స్పెక్టర్ బి.పెంటారావుతోపాటు నలుగురు కానిస్టేబుళ్లను మాతృవిభాగంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం ఖాజూరుకు చెందిన నారద నీలాద్రి (39) జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడి కార్లు ధ్వంసం చేయడం కలకలం రేపింది. భద్రత సిబ్బందిని నెట్టేసి, డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లోని రెండు వాహనాలను ధ్వంసం చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

## దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లో అజ్‌మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రపంచస్థాయి వ్యూహంలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సు మేరకు కేంద్రం దీనిని ప్రారంభించింది. ప్రతి ఏటా 1.15 కోట్ల వ్యాక్సిన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోగ్యశాఖ వెల్లడించింది.

ఈ వ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులు పంపిణీ చేశారు. దీంతో పలు దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులు అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్యాపరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

### ఎమర్జెన్సీ అలర్ట్స్ చూసుకోండి
## ఇరాన్, ఇజ్రాయెల్‌లోని పౌరులకు భారత ఎంబసీ అడ్వైజరీ



**న్యూఢిల్లీ :** ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ దద్దరిల్లింది. తాము ప్రతీకార దాడులు చేపడతామని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ అత్యయిక పరిస్థితిని ప్రకటించింది. అక్కడ సైరన్ల మోత వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయాలు అడ్వైజరీ జారీ చేశాయి. అనవసర ప్రయాణాలు చేయొద్దంటూ భారత పౌరులను హెచ్చరించాయి. "ఈ ప్రాంతంలో నెలకొన్న భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఇజ్రాయెల్‌లోని భారత పౌరులంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఇజ్రాయెల్ అధికారులు జారీ చేసే భద్రతా మార్గదర్శకాలను పాటించాలి. అత్యవసరం కాని ప్రయాణాలు చేయకుండా సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలి. ఎప్పటికప్పుడు స్థానిక వార్తలు, ఎమర్జెన్సీ అలర్ట్‌లను గమనించుకోవాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే టెల్‌అవీవ్ భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలి (+972-54-7520711; E-mail: cons1.telaviv@mea.gov.in)" అని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం పోస్టు పెట్టింది. తాము ఎప్పటికప్పుడు అప్‌డేట్లు షేర్ చేస్తామని పేర్కొంది.

## సంస్కృత భాష పోస్టర్‌పై వివాదం క్షమాపణలు చెప్పిన హార్వర్డ్

**అమెరికా :** సంస్కృత భాషా కార్యక్రమంపై ఇటీవల హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని దక్షిణాసియా అధ్యయన విభాగం చేసిన పోస్టుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో విశ్వవిద్యాలయం క్షమాపణలు చెప్పింది. హార్వర్డ్‌లోని దక్షిణాసియా అధ్యయన విభాగం ప్రాథమిక, ఇంటర్మీడియట్, ఉన్నతస్థాయిలలో కొన్నేళ్లుగా సంస్కృత కోర్సులను అందిస్తోంది. ఇందులోభాగంగా ఎలిమెంటరీ సంస్కృత కోర్సును ప్రోత్సహించడానికి ఓ పోస్టర్‌ను రూపొందించి దాన్ని ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ పోస్టర్‌లో కృష్ణుడి చిత్రాన్ని చూపించిన తీరుపై పలు హిందూ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా యూనివర్సిటీ అధికారులు పోస్టర్‌ను రూపొందించారని నెటిజన్లు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఈ విషయం సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారింది.

# పాక్‌పై ట్రంప్ ప్రశంసలు : మోదీపై కాంగ్రెస్ విమర్శలు

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. గతేడాది పహల్గామ్‌లో ఉగ్ర దాడులకు కారణమైన వారిని ట్రంప్ కొనియాడటమేంటని ప్రశ్నించింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది.

అఫ్గానిస్థాన్‌తో యుద్ధంలో పాకిస్థాన్‌కు డొనాల్డ్ ట్రంప్ పూర్తిగా మద్దతు పలకడం భారత విదేశాంగ విధానానికి ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించిన ఆయన.. ఇప్పటికే అమెరికాతో మన ఆర్థిక దౌత్యం పూర్తిగా విఫలమైందన్నారు. వాణిజ్య ఒప్పందం తర్వాత కూడా భారత్ నుంచి దిగుమతి చేసుకొనే సోలార్ మాడ్యూల్స్‌పై ట్రంప్ భారీ సుంకాలు విధించిన విషయాన్ని గుర్తుచేశారు. మన వ్యూహాత్మక దౌత్యానికి అధ్యక్షుడు ట్రంప్ పదేపదే అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు.



**పాక్‌పై ట్రంప్ ప్రశంసలు..**

పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నవేళ అమెరికా అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధాన్ని ఆపడంలో జోక్యం చేసుకుంటారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'జోక్యం చేసుకుంటా. కానీ, పాక్ వైపు ఉంటా. అక్కడి ప్రధాని, సైనిక జనరల్‌లను ఎంతో గౌరవిస్తా. పాక్ అద్భుతంగా పనిచేస్తోందని అనుకుంటున్నా" అని చెప్పడం గమనార్హం.

### టీవీకే ఆప్షన్ వేళ
# డీఎంకేతో కాంగ్రెస్ సీట్ల చర్చలు



**చెన్నై:** తమిళనాడులో అధికార డీఎంకే, కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల పంపకంపై ప్రాథమికంగా చర్చలు మొదలయ్యాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉండడంతో ఇప్పటినుంచే సీట్ల పంపకంపై ఇరుపార్టీలు కసరత్తు మొదలుపెట్టాయి. ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జి గిరీష్ చోదంకర్, టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుంతగై, ఏఐసీసీ కో ఇన్‌ఛార్జి నివేదితా ఆల్వా డీఎంకే రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. డీఎంకే సీనియర్ నేత టీఆర్ బాలు నేతృత్వంలోని ప్యానెల్‌తో చర్చలు ప్రారంభించారు.

తమిళనాట 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 స్థానాలకు కాంగ్రెస్ పోటీ చేసింది. ఈసారి కనీసం 35 స్థానాలు తమకు కేటాయించాలని, రెండు రాజ్యసభ స్థానాలు కూడా ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. తొలుత అధికారంలో కూడా భాగస్వామ్యం కావాలన్న డిమాండ్ కూడా డీఎంకే ముందుంచింది. ప్రస్తుతానికి ఆ విషయాన్ని పక్కనపెట్టి అధిక సీట్లు, రాజ్యసభ సీటు విషయంలో పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు డీఎంకే మాత్రం 27, 28 స్థానాలు, ఒక రాజ్యసభ సీటును ఆఫర్ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఒకవేళ డీఎంకే, కాంగ్రెస్‌ల మధ్య సీట్ల పంపకం విఫలమైతే తమిళనాడులో కొత్త పొత్తులు చిగురించే సూచనలు కనిపిస్తున్నాయి. టీవీకే విజయ్‌తో కలిసి వెళ్లే విషయాన్నీ కాంగ్రెస్ పరిశీలించొచ్చని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అటు విజయ్ పార్టీ కూడా కాంగ్రెస్‌తో కలిసి వెళ్లే అంశంపై సుముఖంగా ఉంది. దీనిపై విజయ్ నేరుగా స్పందించనప్పటికీ.. ఆయన తండ్రి ఎస్‌ఏ చంద్రశేఖర్ మాత్రం ఇప్పటికే హింట్ ఇచ్చారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు విజయ్ సిద్ధంగా ఉన్నారంటూ, నిర్ణయం మాత్రం ఆ పార్టీ చేతుల్లో ఉందని పేర్కొన్నారు. ఈ ఆఫర్‌ను కాంగ్రెస్ నేతలు తోసిపుచ్చినప్పటికీ.. డీఎంకేతో పొత్తు విఫలమైతే ఇరు పార్టీలూ కలిసి వెళ్లే అంశాన్ని కొట్టిపారేయలేమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అదే జరిగితే చిరకాల మిత్రులుగా, ఇండియా కూటమి భాగస్వాములుగా ఉన్న డీఎంకే, కాంగ్రెస్‌ల మధ్య దూరం పెరిగే అవకాశం ఉంది.

# రాజ్యసభకు ఎన్నికకానున్న ఎల్‌జీబీటీక్యూ ఎవరీ మేనకా గురుస్వామి?

**న్యూఢిల్లీ :** రాజ్యసభ ఎన్నికల్లో నాలుగు స్థానాలకు తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో మేనకా గురుస్వామి కూడా ఒకరు. ఈ ఎంపిక అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. న్యాయవృత్తిలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఈ మేనక స్టోరీ ఏంటంటే..?

దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో అయిదు స్థానాలు ఖాళీ అవుతుండగా.. అందులో నాలుగు తృణమూల్ ఖాతాలోకి వెళ్లే అవకాశాలున్నాయి. దానిలో భాగంగా రాష్ట్ర మంత్రి బాబుల్ సుప్రియో, బెంగాల్ మాజీ డీజీపీ రాజీవ్‌కుమార్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, నటి కోయల్ మల్లిక్‌లను టీఎంసీ అభ్యర్థులుగా ప్రకటించింది. వీరిలో మేనక సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది. 2018లో స్వలింగ బంధాల గురించి సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఆ బంధాలను నేరంగా చెప్పే ఐపీసీ సెక్షన్ 377ను కొట్టివేయడంలో కీలక పాత్ర పోషించిన న్యాయవాదుల్లో మేనక కూడా ఒకరు. ఈ కేసు వాదించిన



గురుస్వామి కూడా ఎల్‌జీబీటీక్యూ (లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్ వంటి వర్గాలను తెలియజేసే పదం). ఇప్పుడు రాజ్యసభకు ఎన్నికైతే.. పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించే తొలి ఎల్‌జీబీటీక్యూ ఎంపీగా రికార్డు సృష్టించనున్నారు.

# నిలదీసిన భర్తను నరమేధం చేసిన ప్రియుడు..!

**తూర్పు గోదావరి జిల్లా:** పెళ్లి బంధం ఎగతాళి అయ్యింది.. భార్య అక్రమ సంబంధానికి మూడుముళ్లు వేసిన భర్తే బలైపోవాల్సి వచ్చింది.. తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న కోపంతో నిలదీసిన భర్తను, ప్రియుడు దారుణంగా హత్యచేసిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. రంగంపేట మండలం పెద్ద దొడ్డిగుంటకు చెందిన బక్కా నాగేంద్ర (32) భార్య వీరలక్ష్మితో రంగంపేట మండలం నల్లమిల్లికి చెందిన తోరాటి శివ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై నాగేంద్ర, వీరలక్ష్మి దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే గురువారం రాత్రి తన భార్య వీరలక్ష్మితో కలసి శివ ఉండటాన్ని నాగేంద్ర చూశాడు. ఆగ్రహానికి గురైన నాగేంద్ర.. శివను నిలదీయడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మాట మాట పెరిగి గొడవ పడుతూ పక్కనే ఉన్న పంట బోదె వరకూ వచ్చేశారు. ఈ నేపథ్యంలో శివ బలమైన ఆయుధంతో నాగేంద్రపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నాగేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. హత్య అనంతరం కొద్దిపాటి గాయాలైన శివ కూడా పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం అతను అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా నాగేంద్ర మరణం వెనుక భార్య వీరలక్ష్మి, అత్త హస్తం కూడా ఉందని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న అనపర్తి సీఐ సుమంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ హత్యపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి భార్య పాత్రపై వస్తున్న ఆరోపణ




లను కూడా విచారిస్తున్నామని సీఐ తెలిపారు. నిందితులకు తగిన శిక్ష పడేలా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుని కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడారు.

**ఎన్నడూ లేని విధంగా హత్యలు, దాడులు : మాజీ ఎమ్మెల్యే**

పెద్ద దొడ్డిగుంట గ్రామంలో హత్య జరిగిన ప్రాంతాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సందర్శించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గెలిచిన క్షణం నుంచే హత్యలు, దాడులు, మానభంగాలు పెరిగిపోయాయని ఆయన అన్నారు. ఇటీవల పందలపాక, రంగాపురంలలో మహిళల హత్య, అదే గ్రామంలో బాలికపై అత్యాచారయత్నం, ఇప్పుడు దొడ్డిగుంటలో హత్య.. ఇవన్నీ కూటమి పాలన వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనాలు అని వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వారికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అండ ఉందన్న ధైర్యం పెరిగిందని, నేరస్తులకు స్టేషన్ బెయిల్‌లు, బాధితులకు శిక్షలు పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు.

నిందితుడు తోరాటి శివను, అతని బైకును రంగంపేట పోలీస్ స్టేషన్‌కు హత్యకు గురైన బక్క నాగేంద్ర అప్పగించినప్పటికీ, ఎస్సై కేసు నమోదు చేయకుండా అతనిని విడిచిపెట్టారని, అదే నిర్లక్ష్యం ఈ రోజు ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుందని అని సూర్యనారాయణరెడ్డి అన్నారు. బిక్కవోలు, రంగంపేట మండలాల ఎస్సైలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఏరికోరి తెచ్చుకున్నారని అన్నారు. బాధితులపై అక్రమ కేసులు బనాయించి వారిని ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగంపేట ఎస్సై శివప్రసాద్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనపర్తి నియోజకవర్గంలో నేరస్తులకు రాజకీయ అండ, పోలీసుల నిర్లక్ష్యం పెరిగి, ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని అన్నారు.

**ఎస్సైపై చర్యలకు డిమాండ్**

వివాహేతర సంబంధంపై ఈ నెల 6న రంగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మృతుడి నాగేంద్ర తండ్రి బక్కా వెంకటేశులు, తల్లి లక్ష్మి, చిన్నాన్న బక్కా వీర్రాజు, చిన్నమ్మ మంగ, సోదరుడు వీరబాబు తెలిపారు. ఫిర్యాదు చేయడంతో పాటు అక్రమ సంబంధం నడుపుతున్న తోరాటి శివకు సంబంధించిన బైక్‌ను కూడా పోలీస్ స్టేషన్‌లో అప్పగించి న్యాయం చేయమని ఎస్సై శివప్రసాద్‌ను వేడుకున్నామన్నారు. అయినా ఎస్సై పట్టించుకోలేదని, నిందితుడు శివ వద్ద లంచం తీసుకుని తాము అప్పగించిన బైక్‌ను కూడా ఇచ్చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

## సామర్లకోట బాణసంచా
### తయారీ కేంద్రంలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

**భారీ విస్ఫోటం**

పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి.

**ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా**

ప్రస్తుతం విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు పేలుడు ఘటనపై ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఘటనాస్థలికి వెళ్లాలని హోం మంత్రి అనితకు సూచించారు. ఈ మేరకు హోం మంత్రి అనిత అక్కడికి బయల్దేరారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ, కలెక్టర్ సంఘటన స్థలికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

## వేట్లపాలెంలో పేలుడు సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు తెలిపారు.

**మెరుగైన వైద్యం అందించండి: అనిత**

బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న ఆమె.. హుటాహుటిన సంఘటన స్థలికి బయల్దేరి వెళ్లారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. "కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం" -మంత్రి నారా లోకేశ్

**బాధితులకు అండగా ఉంటాం: మంత్రి నారాయణ**

పేలుడు ఘటనపై ఇంఛార్జి మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఘటనాస్థలికి వైద్యులను పంపించి తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## రూ.5,456 కోట్ల వార్షిక బడ్జెట్‌కు తితిదే ధర్మకర్తల మండలి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వెల్లడించారు. ఒంటిమిట్ట కోదండరామ కల్యాణానికి వచ్చే భక్తులకు ఉచిత లడ్డూ పంపిణీని బోర్డు ఆమోదించినట్లు ఆయన తెలిపారు. గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రహదారి, డ్రెయిన్ల అభివృద్ధికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

## పశ్చిమాసియా ఘర్షణలు
### వెనక్కి తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం




**న్యూఢిల్లీ :** దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా భగ్గుమంది. ఇజ్రాయెల్, ఇరాన్‌లు తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో దిల్లీ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ బయలుదేరిన ఎయిరిండియా విమానం వెనక్కి తిరిగివచ్చింది. పశ్చిమాసియాకు వెళ్లే విమానాలు రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. మరో దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కూడా పశ్చిమాసియా దేశాలకు విమానాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు ముఖ్యమని పేర్కొంది. నిరంతరం పరిస్థితులు మారుతుండడంతో ప్రయాణికులకు కావాల్సిన సర్దుబాట్లు చేయడానికి తమ సిబ్బంది కృషి చేస్తున్నారని వెల్లడించింది. పశ్చిమాసియాలో అస్థిరమైన పరిస్థితుల మధ్య ఆయా దేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలకు అంతరాయాలు ఎదురయ్యే అవకాశం ఉందని దిల్లీ విమానాశ్రయం ప్రయాణికులకు హెచ్చరిక జారీ చేసింది. మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్‌లకు వెళ్లాల్సిన తమ విమానాలను రద్దు చేస్తున్నట్లు అనేక విమానయాన సంస్థలు వెల్లడించాయి. ఈ మేరకు జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ ఇతర దేశాలకు చెందిన విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి.

# మంత్రి లోకేష్ ను కలిసిన అతిథి అధ్యాపకులు



విశాఖపట్నం, (విశాఖ సమాచారం): ఆంధ్ర యూనివర్సిటీలోని అతిథి అధ్యాపకుల నిరసన దీక్షలు 14వ రోజుకి చేరిన సందర్భంగా ఈరోజు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని విశాఖపట్నంలోని ఎన్టీఆర్ భవన్ టిడిపి కార్యాలయం నందు అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం సురేష్ మీనన్ కలిసి నారా లోకేష్ కి తమ సమస్యలను వివరించారు , తమకి రోజు వారి వేతనం 225 రూపాయలుగా ఉన్నది అని జీవన ప్రమాణాలు మెరుగైన సందర్భంగా నెలవారి జీతాలు ఇవ్వాలని ఆంధ్ర యూనివర్సిటీ శత జయంతి సందర్భంగా ఒక బహుమానంగా నెల వారి జీతాలు ఇవ్వాలని లోకేష్ ని కిరడం జరిగింది . అదే రకంగా ఆర్టికల్ 14, 19 , 21 ,23 అమలు జరగట్లేదని, అదే రకంగా ఇతర యూనివర్సిటీలో మాదిరిగా ఆంధ్ర యూనివర్సిటీ కూడా మంత్లీ శాలరీ ఇవ్వాలని ఈ సందర్భంగా లోకేష్ ని కోరడం జరిగింది. ఆంధ్ర యూనివర్సిటీలో నేక్ కమిటీ నందు మమ్మల్ని ఫ్యాకల్టీగా చూపించారని అదే విధంగా 3.74 ఆంధ్ర యూనివర్సిటీ సాధించిందని, అందుకు అతిథి అధ్యాపకుల శ్రమ చాలా ఉందని ఈ సందర్భంగా మంత్రికి తెలియ జేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. వీసీని కలవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యక్షుడు డాక్టర్ ఎం సురేష్ మీనన్, డాక్టర్ ఫణి, డాక్టర్ త్రినాథ్, డాక్టర్ కోమలి , డాక్టర.ప్రియాంక, చందన రజిని, దివ్య, కళ్యాణి తదితరులు ఉన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు కోరుతూ ప్రకటన
టెండరు నం.30265221 తేది: 23.02.2026
పని పేరు: RDSO స్పెసిఫికేషన్ - AB/RB-40-2016 (REV.2 లేదా లేటెస్ట్) ప్రకారం ఫ్రైట్ స్టాక్‌లో ఉపయోగం కొరకు AAR అప్రూవ్డ్ CTRB అప్‌గ్రేడెడ్ క్లాస్ E (6x11") కంప్లీట్. TPI ఏజెన్సీ ద్వారా తనిఖీ (వారంటీ వ్యవధి: డెలివరీ తేదీ తరువాత 30 నెలలు)
పరిమాణం: 1000 నం.లు
గమనిక: మెటీరియల్‌ను 45 రోజులలోగా సరఫరా చేయవలెను.
టెండరు తెరచు తేది మరియు సమయం: 23.03.2026న 1500 గం.
పూర్తి వివరాలు www.ireps.gov.in లో లభిస్తాయి
సీనియర్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్ / వాల్తేరు
PR-1176/Q/25-26

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు ప్రకటన నం. WAT-TRS-OT-22-2025-26
పని పేరు మరియు ప్రదేశం:
విశాఖపట్నం/ ఎలక్ట్రిక్ లోకో షెడ్ వద్ద త్రీ ఫేజ్ లోకోస్ IOH షెడ్యూల్ కొరకు M/s KBIL తయారీ CCB బ్రేక్ కంట్రోలర్ యొక్క మరమ్మతు మరియు రిహాబిలిటేషన్ & త్రీ ఫేజ్ లోకోమోటివ్స్‌లో CCB బ్రేక్ సిస్టమ్ యొక్క సమగ్ర మరమ్మతు/ పునరుద్ధరణ
టెండరు విలువ (రూ):
8,54,96,056.26, EMD (రూ.): 5,77,500.00, పని పూర్తిచేయు కాలం: 3 (మూడు) నెలలు
టెండరు ముగింపు తేది మరియు సమయం:
23.03.2026న 1500 గం.
ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు ఏదేని అట్టి మాన్యువల్ ఆఫర్ అందితే విస్మరించబడును.
పై ఇ-టెండర్ల యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు సహా పూర్తి సమాచారం http://www.ireps.gov.in వెబ్‌సైట్ లో లభిస్తుంది.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS)/ విశాఖపట్నం
PR-1171/Q/25-26

# వసతి గృహాలను చక్కదిద్దేలా



విశాఖపట్నం, విశాఖసమాచారం: వివసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సమాచారాన్ని సేకరించి జిల్లాల వారీగా ప్రతి నెలా ర్యాంకులను విడుదల చేస్తోంది. ప్రధానంగా మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా?, హాస్టల్ వార్డెన్ పనితీరుపై మీరు సంతృప్తిగా ఉన్నారా?, హాస్టల్‌లో తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై సంతృప్తిగా ఉన్నారా?.అనే వివరాలు తెలుసుకుంటోంది. టాప్‌లో ఎస్సీ హాస్టల్స్...మెరుగు దిశగా బీసీ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 23 హాస్టళ్లు ఉండగా, రెండు వేల మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 28 హాస్టళ్లు ఉండగా, మూడు వేల మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా హాస్టళ్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సేకరించిన అభిప్రాయాలను బట్టి జనవరి నెలలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలవగా, బీసీ సంక్షేమ శాఖ 18వ స్థానంలో ఉంది. ఫిబ్రవరి నెలకు సంబంధించి తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సాంఘిక సంక్షేమ శాఖ మరోసారి తన స్థానాన్ని పదిలపరుచుకుంది. 76.8 శాతం సంతృప్తి స్థాయితో కృష్ణా జిల్లాతో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. ఇకపోతే, బీసీ సంక్షేమ శాఖ 75.6 శాతంతో 14వ స్థానాన్ని దక్కించుకుంది. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి చినగదిలి, గాజువాక, భీమిలి హాస్టళ్లలో వార్డెన్‌ల పనితీరు, మెనూ పట్ల విద్యార్థులు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తంచేశారు. బీసీ సంక్షేమశాఖకు చెందిన అనేక హాస్టళ్లలో వార్డెన్ పనితీరు, మెనూ, శానిటేషన్‌పై అసంతృప్తి వ్యక్తం కావడంతో 14వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

మెరుగైన ర్యాంకుపై అధికారులు దృష్టి హాస్టళ్ల వారీగా మార్కులను కేటాయిస్తుండడంతో అసంతృప్తి స్థాయి ఎక్కువ ఉన్న వాటిపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తికి కారణమవుతున్న వాటిని పరిష్కరించడంపై దృష్టి సారించినట్టు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేస్తున్నామని, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. టాయిలెట్స్‌లో నిరంతరం నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన రూ.36.5 లక్షలతో వసతి గృహాల్లో నెట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేశామని, నిత్యం మెనూ ప్రకారం వంటకాలను సిద్ధం చేసి అందులో పోస్టు చేయించేలా చూస్తున్నామన్నారు. వార్డెన్లు అందుబాటులో ఉండాలని, రాత్రిపూట స్టడీ అవర్స్ సరిగా జరిగేలా చూడాలని ఆదేశించినట్టు తెలిపారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి సలహాలను తీసుకుంటున్నట్టు తెలిపారు.

# రక్తసంబంధీకులు




విశాఖపట్నం, విశాఖసమాచారం: శ్రీకాకుళం కల్చరల్ విద్యతో పొందిన జ్ఞానం సమాజానికి ఉపయోగపడితేనే అది నిజమైన విద్య అన్నటువంటి సూక్తిని నగరంలోని పీఎన్ కాలనీలో ఉన్నటువంటి న్యూ సెంట్రల్ స్కూల్ ఉపాధ్యాయులు చాటి చెబుతున్నారు. గత 8 ఏళ్లుగా విద్యార్థులకు సామాజిక దృక్పథం అలవర్చుచుకునేలా బోధన చేస్తున్నారు. వారిచ్చిన స్ఫూర్తితో 473 మంది విద్యార్థులు జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులుగా సేవలందిస్తున్నారు. వీరంతా ప్రతీ ఏడాది తమ తల్లిదండ్రులను, తమకు తెలిసిన వారిని మోటివేట్ చేస్తూ మరింతగా ముందుకెళ్తున్నారు.పాఠశాల వార్షికోత్సవంలో పాఠశాల విద్యార్థుల్లో సామాజిక బాధ్యత నేర్పే క్రమంలో ప్రతి ఏడాది మార్చి మొదటి వారంలో జరిగే పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా రక్తదానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, భారీస్థాయిలో రక్తపు యూనిట్లు సేకరించి రెడ్‌క్రాస్ సంస్థకు అందజేస్తారు. రక్తదాన శిబిరాలు ప్రారంభించిన సంవత్సరం నుంచి 95 యూనిట్లు సేకరిస్తే.. గత సంవత్సరం 258 యూనిట్లు రక్తాన్ని సేకరించడం జరిగింది. అంటే ఈ మహా యజ్ఞంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భాగస్వాములవుతున్న పరిణామం ఆదర్శనీయం. ఈ ఏడాది కూడా మార్చి 1వ తేదీన స్కూల్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. 23 యూనిట్స్ అందించాం స్కూల్లో చదువుతున్న మేము మా ఉపాధ్యాయుల సూచ నల మేరకు ఇప్పటివరకు 23 యూనిట్స్ మా ద్వారా ఇచ్చాం. ఎంతో ఆనందంగా ఉంది. మేము రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా ఉన్నాం. పి.జూహిత్‌రాజ్, జెస్వీ మా ద్వారా 12 యూనిట్లు ఇప్పటివరకు మా ద్వారా 12 యునిట్లు సేకరించాం. రెడ్‌క్రాస్ సభ్యులుగా మా తల్లిదండ్రులు, మా చుట్టాలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాం. వారితో రక్తదానం చేయిస్తున్నాం. మేమూ సమాజ సేవలో మా చిన్నతనం నుంచి సేవాభావాన్ని మాలో నింపిన యాజమాన్యానికి ధన్యవాదాలు. మేము కూడా జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యత్వం తీసుకొని ఇప్పటివరకు 8 యూనిట్ల రక్తం సేకరించాము. దీనికి మాకు సంతోషంగా ఉంది. ☐ జె.జస్వంత్, జె.ప్రభాస్ 1న రక్తదాన శిబిరం ఈ ఏడాది కూడా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశాం. గతేడాది చాలా మంది వచ్చి రక్తదానంలో పాల్గొన్నారు. మా విద్యార్థులకు సామాజిక దృక్పథం అవసరమని సూచిస్తున్నాం. దాని ఫలితంగా గతేడాది ఎక్కువ రక్తం యూనిట్లు సేకరణ చేశాం. ఈ ఏడాది కూడా మరలా మార్చి 1వ తేదీన పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తాం.

# రాష్ట్రవ్యాప్తంగా వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉపాధి పొందేందుకు ప్రభుత్వ సహకారం



విశాఖపట్నం, విశాఖసమాచారం: రాష్ట్రంలో వేర్వేరు రంగాల్లో పది లక్షల మందికి వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి వద్ద నుంచి పనిచేయడం) ద్వారా ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు 'కౌశలం' అనే పథకం ద్వారా అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించింది. గత ఏడాది నవంబరు నుంచి దరఖాస్తుదారులకు సంబంధిత స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు సచివాలయాల్లో రాత పరీక్షలు జరుగుతున్నాయి. జిల్లాలో 607 స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఇప్పటివరకూ 1,73,973 మంది దరఖాస్తు చేసుకున్నారు. జీవీఎంసీ పరిధిలో 1,57,924, ఆనందపురం మండలంలో 5,173, భీమిలి మండలంలో 4,124, పద్మనాభంలో 3,189, పెందుర్తి మండలంలో 3,563 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఉద్యోగాలకు కనీస విద్యార్హత డిగ్రీగా నిర్ణయించారు. శుక్రవారం వరకు 1,21,400 మంది రాత పరీక్షకు హాజరయ్యారు. ప్రతిరోజు జిల్లాలో ఒక వార్డు/గ్రామ సచివాలయంలో కనీసం ఇద్దరు లేదా ఒకరు రాత పరీక్షకు హాజరవుతున్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తు మేరకు సంబంధిత కంపెనీ నుంచి అభ్యర్థులకు రాత పరీక్షకు హాజరుకావాలని సమాచారం అందుతుంది. స్లాట్‌లో పేర్కొన్న విధంగా తమ పరిధిలో ఉన్న స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు సచివాలయంలో రాత పరీక్షకు అభ్యర్థులు హాజరవుతున్నారు. రోజువారీగా ఆయా కార్యాలయాలకు ఎంతమందికి హాజరవుతున్నారనే విషయం సంబంధిత సిబ్బందికి సమాచారం అందుతుంది. ఆ మేరకు వెబ్ కెమెరా సదుపాయం ఉన్న ల్యాప్‌టాప్/డెస్క్ టాప్ కేటాయిస్తారు. గంటపాటు జరిగే రాత పరీక్షను కార్యాలయ ఉద్యోగి వరకు పర్యవేక్షిస్తారు. శుక్రవారం స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు సచివాలయాల జిల్లా అధికారి ఉషారాణి ఆనందపురంలో వర్క్ ఫ్రమ్ హోం పరీక్షను పర్యవేక్షించారు. ఇప్పటివరకూ 1,21,400 మంది రాత పరీక్షకు హాజరుకాగా వారిలో ఎంతమందికి ఇంటర్వ్యూలకు అవకాశం వచ్చింది?, ఎంతమందికి ఉపాధి లభించిందనే సమాచారం సేకరణలో స్వర్ణగ్రామం/స్వర్ణ వార్డు జిల్లా అధికారులు ఉన్నారు. ఇదిలావుండగా ఈ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను ప్రస్తుతం జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో యువత వివరాలు ప్రత్యేకంగా సేకరిస్తున్నారు. ఒక కుటుంబంలో యజమాని, భార్యతోపాటు ఇంట్లో ఉన్న పిల్లల విద్యార్హతలకు సంబంధించి సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేస్తున్నారు. విద్యార్హతల మేరకు త్వరలో వారికి రాత పరీక్షకు అవకాశం వస్తుందని స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు జిల్లా అధికారి ఉషారాణి తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, డిగ్రీ అర్హత ఉన్న ప్రతి యువకుడు/యువతి, గృహిణి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే కోసం వచ్చే సిబ్బందికి సర్టిఫికెట్లు కాపీలు అందించాలన్నారు.వచ్చే సిబ్బందికి సర్టిఫికెట్లు కాపీలు అందించాలన్నారు.

# మిరియాలు చెట్టు నుండి పడిపోయిన రఘునాథ్‌కు మెరుగైన వైద్యం అందించాలి....



అరకు లోయ (విశాఖ సమాచారం): అరకు వేలి మండలం పద్మపురం పంచాయతీ దుమ్మగుడ కాలనీ కి చెందిన దీసరి రఘునాథ్ తన కాఫీ తోటల్లో అంతర్ పంట అయిన మిరియాలు సేకరించడానికి చెట్టు ఎక్కి మిరియాలు తీస్తుండి నిచ్చెన జారికిందపడిపోయరు తలకి బలమైన దెబ్బతగిలింది.అరకు వేలి ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం ప్రభుత్వ వాహనం 108 కు ఫోన్ చేస్తే సకాలంలో అందుబాటులో లేక ఆటో ఎక్కించి అరకు వేలి ఏరియా తీసుకురావడం జరిగింది.అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూన్నారు. ఏజెన్సీ లో కాఫీ రైతులు అనేక మంది ప్రమాదవసత్తు పడిపోయి ప్రాణం దాకా తెచ్చుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి కాఫీ రైతులకు ఇన్సూరెన్స్ బీమా ప్రభుత్వం కల్పించి కాఫీ రైతులకు భరోసా ఇవ్వాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పద్మాపురం పంచాయతీ ఉపసర్పంచ్ జన్ని భగత్ రామ్, జన్ని, అర్జున్, పిసుంక్ర తదితరులు డిమాండ్ చేయడం జరిగింది.

# విద్యార్థులు..రేపటి శాస్త్రవేత్తలు



పంటలో నీటి శాతం కొలిచే పరికరం గురించి వివరిస్తున్న విద్యార్థినులు

విశాఖపట్నం, విశాఖసమాచారం: గంట్యాడ గ్రామీణం, బొండపల్లి: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుం టున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో పలు ప్రాజెక్టులు తయారుచేసి అబ్బుర పరుస్తున్నారు.




ప్లాస్టిక్ వ్యర్థాలతో వస్తువులు

రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పలువురు చిన్నారుల విజయాలు తెలుసుకుందాం. గంట్యాడ మండలం నరవ జ్యోతిబా పులే గురుకుల పాఠశాల విద్యార్థినులు నాగవర్షిత, కోమలత, సంధ్యారాణి పంటలో నీటి శాతాన్ని కొలిచే సెన్సార్ పరికరాన్ని తయారు చేశారు. ఇది రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని, పంట ఎండిపోకుండా బోర్లు, ఇతర వనరుల ద్వారా దానంతట వుల తయారీ ప్రాజెక్టు గతేడాది డిసెంబర్‌లో మండల,



జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రశంసాపత్రం లభించింది. దీంతో ప్రసన్నలక్ష్మి, ప్రాజెక్టు తయారీలో సహకరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు సుజాతకు డీఈవో మాణిక్యంనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. మెంటాడ మండలం పెదమేడపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థి రెడ్డి శివ తయారు చేసిన పెప్పర్ ఘోస్ట్ ప్రాజెక్టుకు దక్షిణ భారత స్థాయి జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ బహుమతి దక్కింది. రాష్ట్రస్థాయికి ఎంపికై గతేడాది విజయవాడలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపాడు. 19వ శతాబ్దంలో జాన్ హెన్రీ పెప్పర్ రూపొందించిన దీన్ని సినిమా, నాటకాలు ఇతర కార్యక్రమాల్లో దెయ్యం గాల్లో తేలుతున్నట్లు చూపించేందుకు ఉపయోగిస్తుంటారని, ప్రస్తుతం ఎగ్జిబిషన్లలో వినియోగిస్తున్నారని శివ తెలిపాడు.

# 21,000 ఇళ్లు రద్దు



విశాఖపట్నం, విశాఖసమాచారం: జిల్లాలో నిర్మాణం ప్రారంభం కాని సుమారు 21 వేల ఇళ్లను కేంద్రం గృహ నిర్మాణ శాఖ రద్దు చేసింది. నాలుగేళ్ల క్రితం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద జిల్లాలో గూడు లేని పేదలకు సుమారు 1.4 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాలు కలిగిన వారిని, గూడు లేని నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. పేదల కోసం నగర శివారుల్లో ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో లబ్ధిదారుల తరపున కాంట్రాక్టర్లు నిర్మాణాలు ప్రారంభించారు. ఈ ఇళ్లన్నీ 2025 డిసెంబరు నెలాఖరు (తాజాగా గడువును ఈ ఏడాది సెప్టెంబరు వరకు పొడిగించారు)లోగా పూర్తిచేయాల్సి ఉంది. ఆ విషయాన్ని కేంద్రం పలుమార్లు స్పష్టం చేస్తూ వస్తోంది. అయితే కాంట్రాక్టర్లు నిర్మాణ బాధ్యతలు చేపట్టిన 80 వేల ఇళ్లలో వివిధ కారణాలతో నాలుగో వంతు పనులు ప్రారంభించలేదు. పునాదుల్లో, మరికొన్ని పునాదులు నిర్మించి లోపల మట్టి పూడ్చని దశలో ఉన్నాయి. ఈ మూడు కేటగిరీలు కలిపి సుమారు 20 వేల వరకూ ఉంటాయని అంచనా. అదేవిధంగా సొంత స్థలాలు, ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో మరో 1,000 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో మొత్తం 21 వేల ఇళ్లు గడువులోగా అంటే గత ఏడాది డిసెంబరు 31వ తేదీలోగా ప్రారంభించకపోవడంతో కేంద్రం రద్దు చేసింది. అయితే సెంటు భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు జియో ట్యాగ్ చేయకపోవడంతో ఎక్కువ ఇళ్లు రద్దయినట్టు చెబుతున్నారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం ప్రారంభానికి ముందు లబ్ధిదారులను స్థలం వద్దకు తీసుకువెళ్లి జియో ట్యాగ్ చేయాలి. ఆ తరువాత పునాదులు (పునాదులు నిర్మించి దాంట్లో పూర్తిగా మట్టి నింపాలి) పూర్తిచేసిన తరువాత మరోసారి జియోట్యాగ్ చేస్తారు. అప్పుడు మాత్రమే మొదటి బిల్లు మంజూరుకు అవకాశం ఉంటుంది. కానీ పలు లేఅవుట్‌లలో పాక్షికంగా పునాదులు, కొన్నిచోట్ల పూర్తిస్థాయి పునాదులు నిర్మించినా జియో ట్యాగ్ చేయకపోవడంతో కేంద్రం వాటిని రద్దు జాబితాలో చేర్చిందని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తప్పుబడుతున్నారు. ఇదిలావుండగా జిల్లాలో 21 వేల ఇళ్లు రద్దు కావడంతో హౌసింగ్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ నుంచి పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకున్నారు. తాజాగా ఇళ్ల నిర్మాణాల పూర్తికి ఈ ఏడాది సెప్టెంబరు వరకూ గడువు పెంచిన నేపథ్యంలో పలు సాంకేతిక కారణాలతో రద్దు చేసిన 21 వేల ఇళ్లను పునరుద్ధరించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని యోచిస్తున్నారు.21 వేల ఇళ్లను పునరుద్ధరించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని యోచిస్తున్నారు.

# వి ఎం రంగా విగ్రహ ఏర్పాటుకు సహకరించండి..బుల్లెట్ ధర్మారావు



మచిలీపట్నం, ఫిబ్రవరి. 28(అర్ ఎన్ ఐ): కృష్ణాజిల్లా కేంద్రనగరం మచిలీపట్నంలో గత రెండు రోజుల క్రితం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 41 వ డివిజన్ లో కీర్తిశేషులు శ్రీ వంగవీటి మోహనరంగా గారి విగ్రహాన్ని తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయుటకు కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానమునకు ప్రవేశపెట్టిన మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు గారు ప్రతిపాదించటం పట్ల తూర్పు కాపు సంక్షేమ సంఘం నాయకులకు రాధా రంగా మిత్రమండలి రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు గారు, మిత్రమండలి మహిళా కమిటీ సభ్యులు. వారికి సంఘీభావం తెలిపినారు.. రంగా తో తూర్పు కాపు నాయకులకు ఎంతో అనుబంధం ఉండేదని అలాంటి రంగా విగ్రహాన్ని తూర్పు కాపు సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయుటశీ చాలా శుభసూచికమని గత ఆరు నెలల క్రితం వారు కమిటీ మీటింగు ఏర్పాటు చేసుకున్నప్పుడు తనను కూడా ఆహ్వానించారని తాను వారికి అందుబాటు లో లేకపోయిన నా మద్దతు తెలియజేశానని ఈ సందర్భంగా ధర్మారావు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ దీన్ని రాజకీయం చేయకుండా పేదల పాలిటి పెన్నిధి కీర్తిశేషులు శ్రీ వంగవీటి మోహన రంగా గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు తూర్పు కాపు సంఘం వారికి అండగా నిలవాలని కోరుతూ.. నేను నా వంతుగా కూటమి నాయకులు అందరితో మాట్లాడటమే కాక మున్సిపల్ కమిషనర్ గారితో కూడా మాట్లాడతాను. అందర్నీ కలుస్తాను. అంతేకాక రంగా అందరివాడని ఆయనకి అన్ని కులాలలో అభిమానులు ఉన్నారని రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అందరూ కలిసి రావాలని, ఎవరు రంగా విగ్రహాలు పెడుతున్న వారికి అండగా రాధా రంగా మిత్రమండలి సభ్యులు ఉంటారని ఈ సందర్భంగా బుల్లెట్ ధర్మారావు తెలిపారు.. ఈ సమావేశంలో. బడుగు ఉమాదేవి, కొక్కు ప్రభావతి,వన్నెంరెడ్డి కుమారి, సామినేని మల్లికా, మత్తి వెంకటేశ్వరరావు, ధూళిపాల శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, విన్నకోట సుబ్బారావు,తోట విజయ కుమారి, ముంగాడా బాలాకుమారి, ఎడ్ల అప్పాయమ్మ, అమ్ముల కళ్యాణి, దింటకుర్తి పద్మజ, యాదల పుణ్యవతి, వన్నెంరెడ్డి ప్రసాదు, మట్టా దత్తుడు, కూనపరెడ్డి సత్యనారాయణ, నిడదవోలు శ్రీనివాసరావు, మాగంటి బాలాజీ, బాకీ విజయ్ కుమార్, బొమ్మిడి శంకర్, తదితరులు ఈ సమావేశమునకు పాల్గొన్నారు..

# స్వప్నం.. సాకారం

విశాఖపట్నం, విశాఖసమాచారం: తొలి ప్రయత్నంలో 3 బ్యాంకుల్లో ఉద్యోగాలు పట్టుదలే పెట్టుబడిగా.. క్రమశిక్షణే ఆయుధంగా ఓ సాధారణ ఇల్లాలు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు బ్యాంకు ఉద్యోగాలు సాధించారు. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదంటూ రుజువు చేశారు. మండలంలోని జొన్నలపాడుకి చెందిన ఎం.స్వప్న సాధారణ కుటుంబంలో పుట్టి డిగ్రీ వరకు చదువుకున్నారు. పెళ్లయిన తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టి.. ఉద్యోగ సాధనే లక్ష్యంగా కష్టపడ్డారు. ఆ కష్టానికి ఫలితంగా ఇటీవల విడుదలపై ఐబీపీఎస్ పీవో (బ్యాంకు ఆఫ్ బరోడా), ఆర్ఆర్‌బీ పీవో (తెలంగాణ గ్రామీణ బ్యాంకు), శుక్రవారం విడుదలైన స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో జూనియర్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అత్త, మామలది చేనేత కుటుంబం. ఆమె స్వస్థలం విశాఖపట్నం.



విశాఖ సమాచారమ్
ఆదివారం 1-3-2026

# వేలం బాట పట్టిన ప్రజాస్వామ్యం!

భారత ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు హక్కు. రాజ్యాంగ శిల్పి డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కల్పించిన సార్వత్రిక వయోజన ఓటు హక్కు భారత సమాజానికి సమానత్వపు శక్తిని ఇచ్చింది. ఒక పేదవాడి ఓటు, ఒక కోటీశ్వరుడి ఓటుతో సమానమని చెప్పిన వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శం అయింది.

అయితే, ఆ పవిత్ర హక్కు నేడు కొన్ని ప్రాంతాల్లో చిల్లర లావాదేవీగా మారిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.. ఎన్నికల సమయం రాగానే ఓటర్ స్లిప్పులను తీసుకుని, ఎక్కువ డబ్బు ఇచ్చిన అభ్యర్థిని గెలిపించడం, తక్కువ ఇచ్చిన వాడిని ఓడించడం వంటి ప్రవర్తనలు ప్రజాస్వామ్య ఆత్మను దెబ్బతీస్తున్నాయి..

ప్రజాస్వామ్యం వేలం వ్యవస్థగా మారితే..

'పని, సేవకు విలువ లేకుండా డబ్బుకే విలువ పెరిగింది' అనే వేదన వెనుక వాస్తవం ఉంది. గ్రామ సర్పంచ్ నుంచి ప్రధాన మంత్రి వరకు ప్రతి పదవికీ కోట్లలో 'మినిమం ధర' నిర్ణయించి, ఎన్నికల బదులు వేలం పాటలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే వ్యంగ్య ప్రతిపాదన అసలు సమస్యను బలంగా చూపిస్తుంది. ఈ ఆలోచనలో వ్యంగ్యం ఉన్నా, దాని వెనుక దాగి ఉన్న అసహనం గంభీరమైనది. ప్రజాస్వామ్యం వేలం వ్యవస్థగా మారితే, గెలిచినవాడు పెట్టుబడిని వసూలు చేసుకునేందుకు అధికారాన్ని వాడుకుంటాడు.. ఓడినవాడు అప్పులపాలు అవుతాడు. ప్రజా సేవ లక్ష్యం కాకుండా డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతుంది.

డబ్బుల వసూళ్లలో సమానత్వం!

ఎన్నికల సమయంలో కనిపించే మద్యం, విందులు, డబ్బుల పంపిణీ, మైకుల మోతలు ప్రజల నైతిక స్థితిని కూడా ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి.. ఎన్నికల షెడ్యూల్ రాకముందు సాధారణ భారతీయుడిలా ఉన్న ఓటరు, షెడ్యూల్ రాగానే డబ్బు కోసం పాశవికంగా మారిపోతాడనే వ్యాఖ్య అతిశయోక్తి అయినా, పరిస్థితి ఆ దిశగా సాగుతోందనే సంకేతాన్ని ఇస్తుంది. అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా పాల్గొనడం సామాజిక విలువల క్షీణతను సూచిస్తుంది.

ప్రజాస్వామ్యానికి పూర్తి సమాధి!

అయితే, ఈ సమస్యకు పరిష్కారం ఎన్నికలను రద్దు చేసి వేలం పాటలు పెట్టడమా! అసలు అది ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా సమాధి చేయడమే అవుతుంది. ప్రజల చేతుల్లోని హక్కును తీసివేసి, పెట్టుబడిదారుల పాలనకు అప్పగిస్తే అది రాజ్యాంగ విరుద్ధమే కాక, సామాజిక అసమానతలను మరింత పెంచుతుంది. సంక్షేమ పథకాలను ఎత్తివేసి, 'నాకు ఇల్లు కావాలి, నాకు పెన్షన్ కావాలి' అని అడిగే హక్కును లేకుండా చేయాలనే ఆలోచన ప్రజల్ని పౌరుల నుంచి కేవలం పన్ను చెల్లింపుదారులుగా మార్చేస్తుంది. ప్రజాస్వామ్యం వ్యాపార రీతిలో వేలం పాటలతో నడవాల్సిన సంస్థ కాదు. అది ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకున్న రాజకీయంగా సేవే లక్ష్యంగా పెట్టుకున్న వ్యవస్థ.

తాకట్టులో భవిష్యత్తు

ఇక్కడ అసలు ప్రశ్న.. డబ్బు ఎందుకు గెలుస్తోందని? మొదటిగా, ఎన్నికల ఖర్చులు అమితంగా పెరిగాయి. రెండవది, పార్టీలు అభ్యర్థులను ఎంపిక చేసే విధానం లోపభూయిష్టం. మూడవది, ఓటర్లలో రాజకీయ అవగాహన లోపం. ఐదేళ్ల భవిష్యత్తును కొన్ని వేల రూపాయలకు తాకట్టు పెట్టడం వల్ల వచ్చే దీర్ఘకాలిక నష్టాన్ని చాలామంది అంచనా వేయలేకపోతున్నారు.. గెలిచిన అభ్యర్థి ఖర్చు పెట్టిన డబ్బును తిరిగి సంపాదించాలనే ఒత్తిడిలో అవినీతి దారిలో నడుస్తాడు. ఓడినవాడు అప్పుల్లో కూరుకుపోతాడు. చివరికి సమాజమే నష్టపోతుంది. అందువల్ల సమస్య ఓటులో కాదు.. ఓటు వినియోగంలో ఉంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ఎన్నికల సంస్కరణలు అవసరం. ఓటు అమ్ముకోవడం సామాజిక అపఖ్యాతిగా మారాలి.. మంచి వారిని గెలిపించడం సమాజ గౌరవంగా చైతన్యంతో ఓటరు ముందుగా మారాలి.

ఓటు ఒకరోజు వాస్తవం కారాదు!

'డబ్బే గెలిచింది, డబ్బే ఓడింది' అన్న నిరాశలో నిజంగా నేటి సమాజంలో ఉంది. కాదనటం లేదు.. కానీ పరిష్కారం నిస్సహాయతలో కాదు. ఓటరు అత్యంత అవినీతి పరుడిగా మారుతున్నాడని తేల్చేయడం సులభమే కానీ అతడిని ఆ దిశగా నెట్టింది కూడా ఈ వ్యవస్థే, రాజకీయ సంస్కృతి, సామాజిక విలువల క్షీణత. ప్రజలు దిగజారుతున్నారంటే నాయకులూ నిర్దోషులు కారు.. ఇద్దరూ పరస్పరం ప్రభావితం చేసుకుంటూ ఒక చెడు చక్రవ్యూహంలో చిక్కుకుపోయారు. ఈ స్థితిలో మార్పు రావాలంటే వేలం పాటలు కాదు, విలువల పునరుద్ధరణ అవసరం. ఓటు విలువను గుర్తు చేసే సామాజిక ఉద్యమం కావాలి.. ఐదేళ్ల పాలనను నిర్ణయించే క్షణాన్ని చిల్లరగా చూడకుండా, భవిష్యత్తు బాధ్యతగా చూడాలి. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం నిలుస్తుంది. లేదంటే వేలం పాటల వ్యంగ్యం ఒక రోజు వాస్తవంగా మారే ప్రమాదం ఉంది.

# తెలుగుతల్లికి నీరాజనం "ఆంధ్రగీతి"

"తెలుగమ్మా..! నీకు వందనాలు,
ఆంధ్ర మాతా.. మంగళగానాలు!
నీ పాటలు మ్రోయు తుమ్మెద నాదాలు,
నీ మాటలు మందార మకరందాలు!"

అనితర సాధ్య ప్రజ్ఞా దురంధరుడు,ఆయుర్వేద వైద్యుడు,శతాధిక గ్రంథ రచయిత డా.జీ.వీ.పూర్ణచంద్ కలం నుంచి జాలువారిన "ఆంధ్రగీతి" కావ్యాన్ని తెలుగుతల్లికి వందనాలతో శ్రీకారం పలికారు.తెలుగుభాషను ఆపోసన పట్టి భాషాభ్యుదయానికి కృషిచేసిన తెలుగు తేజాల గుణగణాలను చేసిన వర్ణన భాషావికాసపు అమర రథచక్రాల తో పోల్చడం ఆయన భాషాపేక్షకు మచ్చుతునక.

"కృష్ణ, గోదావరి తుంగభద్ర నదీమాతల ఒడి..
తెలుగు పలుకుల పురిటిగడ్డ సుసంపన్నం" లో ఆంధ్ర ప్రాంత వైశిష్ట్యం కనిపించింది.

మాండలిక శోభ నిరుపమానమై పరివ్యాపితమై కథ అంతటా విరాజిల్లుతోంది.

"మాండలికాలన్నీ
అచ్చు తెలుగు పలుకులే!
అగ్నికణాల చెకుముకులు..
ఒరుసుకుంటే అంటుకునే దీపశిఖలు" అనిభాషను సుసంపన్నం చేయడంలో వాటి ప్రాధాన్యత విశదీకరణ హర్షాతిరేకం.ఒక ప్రాంతం

మాండలికాన్ని ఇతర ప్రాంతాలవారు గౌరవించడం మర్యాద. అందుకు ఉమ్మడి నిఘంటువు అవసరమని రచయిత సూచన ముదావహం.ఏ యాస అపహాస్యం కారాదని చెప్పడం సహృదయత. ప్రాంతానికో మాండలీకాన్ని పోషించే "ఆంధ్రులప్రశస్తి" గూర్చి గర్వంగా కావ్యంలో ప్రస్తావించడం విశేషం.

"ఎవరమీ ఆంధ్రులం? ఎప్పటివారమీ జాతీయులం?
చరితపుటలలో జాడలు కొల్లలు మనవి
శిలాశాసన సాక్ష్యాలెన్నో... సాహిత్య భాష్యాలింకెన్నో..
జానపదుల గీతాలే చరిత్ర గర్వమైనిలిచాయి!"

"తొలి వెలుగు నుదులందుకుని జ్ఞానసింధు తీరాలు చేరిన తెలుగు" అంటూ మన భాషప్రాచీనతను వెల్లడిచేయడం భాషాభిమానం.'పరాయిగీతాలు పాడి పొగిడారు తెలుగువారు' అని స్వాభిమానం పై ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.తెలుగు భాషకు,తెలుగు వారికీ ఎల్లలు లేవని ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి ఉన్నారని అదే మన తెలుగు వారికి గర్వకారణంగా చెప్పడం రచయిత అవగాహనా చాతుర్యానికి గీటురాయి.

'పలుకుబడుల పరిమళాలు' తాంబూలంలో ఆకు,వక్క,సున్నాల్లా మనవైన పరాయి భాష లను ప్రస్తావించడం,వాటిని అక్కున చేర్చుకోవడం..ఆత్మీయత చూపడం గమనార్హం.ప్రజల పలుకులకు పద నీరాజనం అన్నారు.తల్లిభాష మరచిపోని రీతిలో అన్యపదాలు మనసు తెరచి కాంతినివ్వాలని భాషాభిమానం చాటారు.

వేదప్రసక్తి విరివిగా ఉపయోగించారు.తెలుగు భాషకు దేవభాష సంస్కృతానికి ఉన్న బంధాన్ని కావ్యంలో అభివ్యక్తీకరించడం విశేషం.వేదాల వానలో నానిన జ్ఞానం,తెలుగమ్మకు అలంకరించిన వైనం అంటూ వేదనాదంలో భాషాగీతం అనే రీతిలో పోల్చారు.అచ్చతెలుగు వదిలి ఆంగ్లానికేపట్టం కట్టినట్లు,'ఆలిని విడిచి వెలయాలి వలపు' కోరుతున్నారని భాషానైరాశ్యం వెలిబుచ్చారు.కంట తడి తుడుచుకుంటున్న తల్లిముఖాన నిశివీధిలో నిశ్శబ్దమై అక్షరాలు ప్రపంచమంతా వలస బయలుదేరాయని నేటి తెలుగుభాష కొడి గుట్టుతున్న వాస్తవికతను స్పష్టం చేయడం ఆందోళనకరం. 'ఎండుటాకు కాదు భాష,మహాపర్వతమన్నారు.పర్వతాలశిలలే అక్షర ఆకృతులు,వాటిలోవెలసిన జీవరేఖలే శాశ్వతమని' భవిష్యత్తు పై ఆశాభావం వ్యక్తం చేశారు.

'మినుకుపలుకుల'పేరుతో పారిభాషిక పదాలపై స్నేహమాధుర్యాన్ని రంగరించారు. మాటలచెట్టుకు అక్షరాల విత్తనాలన్నారు.గుత్తులుగా ఫలాల్ని పారితోషిక పదాలుగా వర్ణించారు. పాలను కాయడం "ఆనవాలు"గా పేరు పెట్టి అది తెలుగువాడి యుక్తిగా తన కావ్యంలో చెప్పారు.అదే చెడును తొలగించే క్షీరతత్వ సారసంగ్రహంగా, పాపాలు తొలగించే మోక్షమార్గం,పవిత్రమార్గదర్శనంగా పోలిక చెప్పడం కవిహృదయానికి నిదర్శనం.

చివరగా

"భాష.. భవిష్యత్తు పలికే అనుభవం గాథ!
మాట..గళాన్ని కదిలించే కలల స్వరం!
పలుకు.. తరతరాల హృదయధ్వని!
పదబంధం.. బుద్ధి మెరిసే తొలి కిరణం!"

పరాయి భాష లో పలుకులు మెదడు పొరల్లోంచి వస్తాయని,అమ్మ భాషలోని మాటలు హృదయకాసారంలోని ఊటలుగా ఊరతాయని కటువుగా చెప్పినా అక్షరసత్యాలు .అదే "ఆంధ్ర గీతి" గొప్పదనం.బహుముఖ ప్రజ్ఞాశాలి జీవీ పూర్ణచంద్ కవితా మాయా జాలం.

ఛాయచిత్ర ప్రదర్శన

కొసమెరుపు ఏమంటే

"ఆంధ్ర గీతి" ఆవిష్కరణతో పాటు "గాథాశతి" పేర జీవీ పూర్ణచంద్ వందగాథలు,స్వీయ ఆంగ్లానువాదం,వర్ణచిత్రాలతో కవితా ప్రదర్శన (ఛాయచిత్ర ప్రదర్శన) చేపట్టడం ముదావహం.

ఉదాహరణకు "వ్యాసంగం" శీర్షికన ఆయన రాసిన గాథ



"ఆవకాయ పెట్టాక వారంపాటు ఊరబెట్టినట్టు,కవితను కూడారాసి పక్కన పెట్టి కలియదిప్పాలి, ఆవఘాటు ఒక్కటే ఆవకాయకైనా,కవితకైనా,మనసులో ఊరితేనే రుచి....త్వరపడితే అంతా ఉప్పనే! "

కవితలను ఆవకాయతో పోల్చి అచ్చమైన పదహారణాల ఆంధ్రుడిగా నిరూపించుకున్నారు రచయిత.ఇలాంటి గాథలు వంద రాసి సాహితీ ప్రియులు మన్నలను పొందారు.ప్రతి కవితా అక్షర సుమమే..వాటిని చూసి, చదివి తీరవలసిందే. త్వరలో ప్రచురించి భాషాభిమానులకు అలరిస్తారని ఆశిద్దాం.

**డా. జీవీ.పూర్ణచంద్**

# బెజవాడ ఎగ్జిబిషన్

70,80 దశకాల్లో బెజవాడలో ఎగ్జిబిషన్ పెట్టారంటే పోలోమని అందరూ బయలుదేరేవారు.ఆనాడు పట్టణంగా ఉన్న బెజవాడలో మధ్యతరగతి,దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువ.ఇంకా అప్పటికి రియల్ ఎస్టేట్ భూతం తన ప్రతాపం చూపడం ప్రారంభించలేదు.ఆ సమయంలో ఈ వర్గాలకు వినోదం ఎగ్జిబిషన్, సర్కస్ వంటివే. ప్రతి ఏడాదీ వేసవి కాలంలో నెలా వారం పాటు పట్టణ ప్రజలను అలరించేది. రాత్రి పూట సిగ్నల్ లైట్ పట్టణమంతా గిర్రున తిరిగేది. వేసవిలో సాయంత్రం సరదాగా సిటీబస్సులోగానీ, రిక్షాలో గానీ పీడబ్లుడీ మైదానానికి బయలుదేరేవారు.ఎంట్రెన్స్ టిక్కెట్ రూపాయిలోపు ఉండేది.మేమయితే ప్రతి ఆదివారం అక్కడ ప్రత్యక్ష మయ్యేవారం.కొనేవి ఏమీ లేకపోయినా మొత్తం మైదానం అంతా చెడతిరిగేవారం. కుర్రాళ్లం కదండి. సరదాగా జోకులు వేసుకుంటూ ప్రతి స్టాల్ తిరగుతూ చూసేవారం. ఎగ్జిబిషన్ ఉన్నన్నాళ్లు ప్రతి ఆదివారం తప్పక హాజరయ్యేవారం. ఒక సారి ఒక సైకిల్ కంపెనీ అమ్మాయి సైకిల్ తొక్కుతున్నట్లుగా ప్రదర్శనలో పెట్టింది. బొమ్మ అయినా అచ్చం అమ్మాయిలాగా ఉంది.దాన్ని చూసి మా స్నేహితుడు రెడ్డి గాడు నిజంగా అమ్మాయనుకుని సిగ్గుపడి నేల చూపులు చూసాడు. తల ఎత్తమన్నా వాడు అలాగే చూస్తూ ఏదో మాట్లాడేస్తున్నాడు. దాంతో మేమందరం ఒక్కసారిగా బిగ్గరగా నవ్వాం. దాంతో వాడు ఈ లోకంలోకి వచ్చాడు. అలాంటి అనుభవాలు బోలుడన్నీ. ఒకసారి రూపాయి కాగితం మైదానంలో వేసి దూరంగా నుల్చునేవారం. ఎగ్జిబిషన్ చూడడానికి వచ్చినవారు దాన్ని చూసి అటూఇటూ పరికించి తీసుకుని రహస్యంగా దాచుకొనే సమయంలో మేము వెళ్లి మాది అని జేబులోంచి పడిపోయిందని చెప్పడంతో వాళ్ల ముఖంలో రంగులు మారడం చూస్తే నవ్వు ఆగేదికాదు. అది సినిమా ట్రిక్ అయినా ఎవర్ గ్రీన్. అలా ఆనందించేవారం. భాగ్యనగరంలో ఎగ్జిబిషన్ నా చిన్నప్పటి నుంచి నాంపల్లి గ్రౌండ్స్ లోనే ఇప్పటికీ జరుగుతున్నది. పీడబ్లుడీ మైదానంలో సర్కస్ కూడా పెట్టేవారు.సర్కస్ లో జంతువులను రింగ్ లో పెట్టి రింగ్ మాస్టర్ ఆడించడం,బఫూన్ ఆటలు, నూతిలో మోటార్ సైకిల్ నడపడం,ఉయ్యాల మీద సర్కస్ అమ్మాయిలు విన్యాసాలు, ఎలుగుబంటి,ఏనుగుల ప్రదర్శనలు మరచిపోలేం.ఈనాడు సర్కస్ పెట్టినా జంతువులను అనుమతించడంలేదు. అదే మైదానంలో పుస్తక ప్రదర్శనలు ప్రతి ఏడు జరిపేవారు. ప్రతి ఏడాది జనవరి మొదటివారంలో బెజవాడలో పుస్తకాల పండుగ జరిగేది.అక్కడికి ప్రతి రోజు ప్రముఖులు,ప్రచురణకర్తలు సభలు,పుస్కకావిష్కరణలు జరిపేవారు. తప్పని సరిగా ఒకటి రెండు రోజులు వెళ్లి కావలసిన పుస్తకాలు కొనుక్కుని తెచ్చి చదువుకుని ఆనందించేవారం. దీపావళి వచ్చిందంటే టపాసుల షాపులు అక్కడే వెలసేవి. నేను బైక్ పీడబ్లూడీ మైదానంలోనే నేర్చుకున్నాను. చాలా మంది కారు డ్రైవింగ్ కూడా ఆ మైదానంలోనే నేర్చుకున్నారు. రైతు బజారు కూడా కరెంట్ ఆఫీస్ వైపు చాలాకాలం నడిచింది.ఎగ్జిబిషన్ కమిటీ కార్యాలయం వెనకవైపు ఉండేది.

కాని ఇప్పుడు దళిత జనోద్ధారణ కారకుడు,రాజ్యాంగ శిల్పి బాబాసాహెబ్ అంబేద్కర్ భారీ విగ్రహం సాక్షాత్కరిస్తున్నది.అది మంచివిషయమే కానీ ఆయనకు అది సరైన చోటుకాదు.ఎప్పుడూ ప్రజలు,నాయకులు తిరిగే చోట ఉంటే ఆయన త్యాగం,మేధ కొంత అయినా వారు నేర్చుకుంటారని ఆశ.తెలంగాణలో లాగా అసెంబ్లీ ముందో మరోచోట ఆ మహానాయకుడి విగ్రహాన్ని పెడితే మరింత ఆదరణ ఉండేది.గత ప్రభుత్వం ఉన్నంతవరకూ దాని ఆలనాపాలనా జరిగింది. బెజవాడ లో ఉన్న ఏకైక మైదానం దాని ప్రాముఖ్యత కోల్పోయి ఓట్ల రాజకీయానికి బలైంది.కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడిన సీనియర్ జయప్రకాశ్ నారాయణ్ సభ 1977 లో సన్నని వర్షంలో అక్కడే జరిగింది.అంతకుముందు ఆ గ్రౌండ్ లో మహామహుల సభలు జరిగాయి. బందరు రోడ్డు మీద వెళ్లినప్పుడల్లా స్వరాజ్ మైదానం గతవైభవం గుర్తుకు వస్తుంది.

**యం.వి.రామారావు**

# కుంగుబాటుకు వ్యాయామ కళ్లెం!

కుంగుబాటు (డిప్రెషన్), వ్యాయామం ఒకదాన్ని మరోటి ప్రోత్సహిస్తుంటాయి. కుంగుబాటుతో వ్యాయామం మీద ఆసక్తి తగ్గుతుంది. తగినంత శారీరక శ్రమ లేకపోతే కుంగుబాటు మరింత తీవ్రమవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారికి వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. దీంతో, ముఖ్యంగా బరువులెత్తే వ్యాయామాలతో మందులు, చికిత్సలతో సమానమైన ఫలితాలు కనిపిస్తున్నట్టు తాజాగా తేలింది. యూనివర్సిటీ ఆఫ్ లాంకషైర్ పరిశోధకులు 70కి పైగా ప్రయోగ పరీక్షలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. మానసిక స్థితి (మూడ్) మీద శారీరక శ్రమ గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నట్టు గత పరిశోధనలు చెబుతున్న విషయాన్ని ఇది మరింత బలపరచింది. వ్యాయామం, శారీరక శ్రమలు కుంగుబాటుతో ముడిపడిన వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తాయి. జీవ గడియారాన్ని తిరిగి సరిచేసి నిద్ర బాగా పట్టేలా చేస్తాయి. నాడీ కణాల వృద్ధికి తోడ్పడే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ విడుదలనూ ప్రేరేపిస్తాయి. ఈ ఫ్యాక్టర్ మూడ్ నియంత్రణకు దోహదం చేయటం గమనార్హం. అందువల్ల కుంగుబాటు బాధితులు వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దని పరిశోధకులు సూచిస్తున్నారు. చికిత్స ప్రణాళికల్లో దీన్ని విధిగా చేర్చాలని చెబుతున్నారు. ఈ సమీక్ష కోసం పరిగణనలోకి తీసుకున్న అధ్యయనాలు కొన్ని పాఠాలనూ నేర్పుతున్నాయి.

1. ఒక చికిత్స సరిపోదు

కుంగుబాటు మనిషిని చాలా తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. జీవితంలో తృప్తిని ఘోరంగా దెబ్బతీస్తుంది. ఇలాంటి తీవ్ర సమస్యకు ఒక చికిత్స సరిపోదు. సైకోథెరపీ, యాంటీడిప్రెసెంట్ మందులకు వ్యాయామాన్ని జోడిస్తే మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అందుకే మందులు వేసుకుంటున్నా, వేసుకోకపోతున్నా సైకాలజిస్టును సంప్రదించటం, వ్యాయామం చేయటం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

2. ఎంత శ్రమకు అంత ఫలితం

వ్యాయామం చేస్తేనే సరిపోదు, ఎంత తీవ్రంగా చేస్తున్నామన్నదీ ముఖ్యమే. మామూలు వ్యాయామం కన్నా తీవ్రమైన వ్యాయామంతో ఎక్కువ ఫలితాలు కనిపిస్తున్నాయి. శరీరాన్ని 10 నుంచి 20 నిమిషాలు ఒకింత ఎక్కువ శ్రమకు గురిచేసినా చాలు. తీవ్రమైన వ్యాయామంటే మరీ కష్టమని అనుకోవాల్సిన పనిలేదు. పక్కవారితో మాట్లాడటం కష్టంగా అనిపిస్తే తీవ్రంగా చేస్తున్నట్టే లెక్క. ఇది ఆయా వ్యక్తుల శరీర సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది.

3. వ్యాయామం ఏదైనా

నడక, నెమ్మదిగా పరుగెత్తటం, యోగా, బరువులు ఎత్తటం.. ఇలా ఏ రకం వ్యాయామమైనా కుంగుబాటు చికిత్సకు తోడ్పడుతుంది. రెండు, మూడు వారాలుగా కుంగుబాటుతో బాధపడేవారికి డ్యాన్స్ చాలా మేలు చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ వీటిల్లో కొద్దిమందిని.. అదీ యువతులను పరిగణనలోకి తీసుకోవటం వల్ల అందరికీ వర్తింపజేయటం తగదని పరిశోధకులు భావిస్తున్నారు. బరువులెత్తటం, సైకిల్ తొక్కటం ఆడవారికి బాగా ఉపయోగపడుతుంటే.. యోగా, థాయ్ చీ మగవారికి మరింత మేలు చేస్తున్నట్టు కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. వృద్ధులకు యోగాతో, చిన్నవయసువారికి బరువులెత్తటంతో ప్రయోజనం కనిపిస్తోంది. యోగా, బరువులు ఎత్తటాన్ని మానకుండా కొనసాగిస్తున్నట్టూ బయటపడింది.

4. తోడుగా చేస్తే

ఐకమత్యం బలమనే సూత్రం వ్యాయామానికీ వర్తిస్తుంది. ఒంటరిగా కన్నా నలుగురితో కలిసి వ్యాయామాలు చేస్తే కుంగుబాటు లక్షణాలు మరింతగా తగ్గుతుండటం గమనార్హం. కుంగుబాటులో ఒంటరిగా ఉండిపోవటం పెద్ద లక్షణం. నలుగురితో కలిసి వ్యాయామం చేస్తే ఒంటరితనం దూరమవుతుంది. ఇతరుల కన్నా మరింత కఠినంగా చేయాలనే కోరికా కలుగుతుంది. కాబట్టి వీలుంటే జిమ్‌లో చేరి శిక్షకుల సమక్షంలో లేదా బృందంగా వ్యాయామం చేయటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

5. నైపుణ్యం సాధిస్తే

వ్యాయామాల్లో నైపుణ్యం సాధించటమూ దిగులు, నిరాశ ఎక్కువగా తగ్గటానికి తోడ్పడుతుంది. ఒకింత ఎక్కువ బరువు ఎత్తటం.. కాస్త ఎక్కువ దూరం, ఎక్కువసేపు పరుగెత్తటం కూడా నైపుణ్యం కిందికే వస్తాయి. కుంగుబాటు ఎప్పుడూ గొప్ప పనులు చేయలేవని మనిషిని వెనక్కి లాగుతుంటుంది. దీంతో చాలామంది అక్కడే ఆగిపోతుంటారు. వ్యాయామం దాన్ని అబద్ధమని నిరూపిస్తుంది. మారటం సాధ్యమేనని, కొత్త అలవాట్లు నేర్చుకోవచ్చని, మెరుగ్గా పనులు సాధించొచ్చని నేర్పిస్తుంది. ఇది నిజంగా ఒక శక్తిమంతమైన ఔషధమే. పరుగు, బరువులెత్తటం శరీరానికి పరీక్ష పెట్టి, పురోగతి సాధించేలా చేస్తాయి. యోగా, థాయ్ చీ వంటివి ఏకాగ్రత, జాగరూకత ద్వారా నైపుణ్యం పెంపొందిస్తాయి.

6. ఫలితాలు నెమ్మదిగా

వ్యాయామ ఫలితం కనిపించటానికి కొంత సమయం పడుతుంది. కౌన్సెలింగ్, యాంటీడిప్రెసెంట్ మందుల విషయంలో డాక్టర్లు ఎవరికి ఏది పడుతుందో, ఎంత మోతాదు సరిపోతుందో తెలుసుకోవటానికి సమయం పడుతుంది. మరోవైపు వ్యాయామానికి శారీరక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిమితులు అడ్డుతగులుతుంటాయి. ఎవరికేది నప్పుతుందో, ఆనందంగా చేయగలిగిన వ్యాయామాలేంటో గుర్తించటానికి కాస్త సమయం అవసరం. అప్పుడే మధ్యలో మానెయ్యకుండా ఉండటం సాధ్యమవుతుంది. క్రమం తప్పకుండా చేస్తుంటే నెమ్మదిగా ఫలితాలు కనిపించటం మొదలవుతుంది.

## యాంటీ బయోటిక్స్ వాడితే.. పేగుల ఆరోగ్యాన్ని ఇలా రక్షించుకోండి



భారతదేశంలో యాంటీబయాటిక్స్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా చాలా మందిలో సాధారణ జలుబు వస్తూ ఉంటుంది. ఇది పిల్లల నుండి పెద్దల వరకు అందరిని ప్రభావితం చేస్తుంది. జలుబు త్వరగా తగ్గాలని దాని లక్షణాల నుండి త్వరగా బయటపడాలని చాలా మంది యాంటీబయాటిక్స్ ను ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఆధునిక వైద్యంలో యాంటీ బయాటిక్స్ మూలస్తంభం అయినప్పటికీ సాధారణ జలుబు వంటి వాటికి వీటిని వాడడం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. వీటిని ఎక్కువగా వాడడం వల్ల పేగు ఆరోగ్యం గణనీయంగా దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధికంగా యాంటీబయాటిక్స్ ను తీసుకోవడం వల్ల పేగుల్లో ఉండే జీర్ణక్రియ, పోషకాల శోషణ, రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా కూడా నశిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం..

యాంటీబయాటిక్స్ హానికరమైన బ్యాక్టీరియాతో పాటు మేలు చేసే బ్యాక్టీరియాను కూడా నశింపజేస్తాయి. ఇది డిస్బయోసిస్ అని పిలువబడే అసమతుల్యతకు దారి తీస్తుంది. దీని వల్ల విరేచనాలు, ఉబ్బరం వంటి జీర్ణశయాంతర సమస్యలు కూడా తలెత్తుతాయి. మైక్రోబయోమ్ దాని ఆరోగ్యకరమైన సమతుల్యతను తిరిగి స్థాపించడానికి ప్రయత్నించే సమయంలో ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం పెరుగుతుంది. అందుకే సాధారణ జలుబుకు యాంటీబయాటిక్స్ తీసుకున్న తరువాత చాలా మందికి కడుపు నొప్పి వస్తుంది. గట్ ఆరోగ్యంపై యాంటీ బయోటిక్స్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియా తగ్గినప్పుడు గట్ లోపల ఉండవల్సిన పదార్థాలు రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తాయి. రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది. దీంతో ఇన్ఫెక్షన్లతో పాటు ఇతర వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుంది. పెరుగు..

కనుక సాధారణ జలుబు వంటి వాటికి యాంటీబయోటిక్స్ ను వాడకపోవడమే మంచిది. ఒకవేళ యాంటీబయోటిక్స్ వాడినప్పటికి వాటిని వాడిన తరువాత పేగు ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం కూడా చాలా అవసరం. యాంటీబయోటిక్స్ వాడిన తరువాత పేగు ఆరోగ్యాన్ని పునరుద్ధరించే కొన్ని చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ప్రోబయోటిక్స్ తీసుకోవడం వల్ల పేగుల్లో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను తిరిగి నింపవచ్చు. లాక్టోబాసిల్లస్, బిఫిడోబాక్టీరియం వంటి జాతులు ఉండే పెరుగు వంటి ఆహారాలను తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు సూక్ష్మజీవుల సమతుల్యత పునరుద్ధరించబడుతుంది. ఉల్లి, వెల్లుల్లి..

వెల్లుల్లి, ఉల్లిపాయలు, అరటిపండ్లు వంటి ప్రీ బయోటిక్స్ ఉన్న ఆహారాలు తీసుకోవాలి. ఇవి పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు ఉండే సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. ఇవి పేగు ఆరోగ్యంతో పాటు మొత్తం ఆరోగ్యానికి దోహదపడతాయి. అలాగే పేగుల లోపలి పొరను నిర్వహించడానికి నీటిని అధికంగా తాగాలి. అధిక చక్కెరలు, ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. ఇవి హానికారక బ్యాక్టీరియ పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. యాంటీబయోటిక్స్ సరిగ్గా ఉపయోగించకపోతే పేగు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కనుక వాటిని వైద్యులు సూచించినప్పుడు వాడడమే మంచిది.

## పిగ్మెంటేషన్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారా



మనం ఎదుర్కొనే చర్మ సంబంధిత సమస్యల్లో పిగ్మెంటేషన్ ఒకటి. చాలా మంది దీనిని చర్మ ఉపరితలంపై వచ్చే సమస్యగా భావిస్తారు. దీనిని తగ్గించుకోవడానికి క్రీములు, సీరమ్స్ వంటి వాటిని వాడడంతో పాటు అనేక రకాల ఇంటి చిట్కాలను పాటిస్తూ ఉంటారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ చాలా మంది నిరాశకే గురి అవుతూ ఉంటారు. మచ్చలు తగ్గినప్పటికీ కొంతకాలం తరువాత ఇవి మరలా తిరిగి వస్తూ ఉంటాయి. అయితే పిగ్మెంటేషన్ చర్మం గురించి మాత్రమే కాదు మన శరీరం గురించి కూడా తెలియజేస్తుందని వైద్యులు చెబుతున్నారు. జీర్ణక్రియ, హార్మోన్లు, ఒత్తిడి, నిద్రతో పిగ్మెంటేషన్ కు దగ్గర సంబంధం ఉంటుందని వారు తెలియజేస్తున్నారు. మొండిగా ఉండే పిగ్మెంటేషన్, పునరావృతం అయ్యే పిగ్మెంటేషన్ అంతర్గత ఆరోగ్యాన్ని సూచిస్తుందని శరీరం మంటగా లేదా ఒత్తిడికి గురైతే కూడా చర్మం దానిని పిగ్మెంటేషన్ రూపంలో చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

**పోషకాలు..**

పిగ్మెంటేషన్ తో బాధపడే వ్యక్తుల్లో పొట్ట ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో పాటు పోషకాల శోషణ కూడా సరిగ్గా ఉండదని, వారు అధిక ఆక్సీకరణ ఒత్తిడితో బాధపడుతూ ఉంటారని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. పిగ్మెంటేషన్ తో బాధపడే వారు ఇంటి చిట్కాలను పాటించడంతో పాటు ఆరోగ్యం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం. జీర్ణక్రియ సరిగ్గా లేనప్పుడు చర్మం తనను తాను రిపేర్ చేసుకోవడానికి తగిన పోషకాలను పొందదు. దీంతో చర్మంపై మచ్చలు అలాగే ఉంటాయి. కనుక రోజూ ఇంట్లో వండిన ఆహారాలనే తీసుకోవాలి. అలాగే ఆహారాన్ని బాగా నమిలి తినాలి. పొట్ట 80 శాతం నిండగానే తినడం మానేయాలి. కాలేయం వ్యర్థాలను తొలగించడం మందగించినప్పుడు పిగ్మెంటేషన్ మొండిగా మారుతుంది. హార్మోన్లు సరిగ్గా లేనప్పుడు, కణాల వాపు ఎక్కువగా ఉన్నప్పుడు పిగ్మెంటేషన్ కణాలు అతిగా ప్రేరేపించబడతాయి. దీని వల్ల పిగ్మెంటేషన్ తిరిగి మరలా వస్తుంది. కనుక ఆహారంలో పండ్లను, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి. భోజనాన్ని మానేయకూడదు..

వంటలో పసుపు, నల్లమిరియాలు ఎక్కువగా వాడాలి. నీటిని ఎక్కువగా తాగాలి. రాత్రిపూట అతిగా తినడం, మద్యం తాగడం వంటివి మానేయాలి. ఇన్సులిన్ నిరోధకత, ఈస్ట్రోజన్ ఎక్కువగా ఉండడం, కార్టిసాల్ అసమతుల్యతలు పిగ్మెంటేషన్ ను ప్రభావితం చేస్తాయి. ఇవి మెలనిన్ ఉత్పత్తిని నిశ్శబ్దంగా పెంచుతాయి. కనుక భోజనాన్ని తప్పకుండా తీసుకోవాలి. ఆహారంలో ప్రోటీన్ ఉండేలా చూసుకోవాలి. శుద్ధి చేసిన చక్కెరను తీసుకోవడం తగ్గించాలి. ఒత్తిడి తగ్గడానికి శ్వాస వ్యాయామాలు చేయాలి. రోజూ నడవడం లేదా శారీరక వ్యాయామాలు చేయడం చేయాలి. నిద్ర, సిర్కాడియన్ రిథమ్ తో మెలనిన్ ఉత్పత్తి ముడిపడి ఉందని సైన్స్ చెబుతుంది.

**నిద్రలేమి..**

నిద్రలేమి ఆక్సీకరణ ఒత్తిడిని పెంచుతుంది. ఇన్సులిన్ నిరోధకతను మరింత పెంచుతుంది, కార్టిసాల్ ను పెంచుతుంది. కనుక రోజూ 6 నుండి 8 గంటలు నిద్రపోయేలా చూసుకోవాలి. స్థిరమైన నిద్ర సమయాలను పాటించాలి. రాత్రిపూట స్క్రీన్ వాడకాన్ని తగ్గించాలి. మనం నిద్రించినప్పుడే చర్మం మరమ్మత్తు జరుగుతుంది. పిగ్మెంటేషన్ తగ్గాలంటే శరీరం ఆరోగ్యం మొత్తం మెరుగుపడాలి. జీర్ణక్రియ, హార్మోన్లు, ఒత్తిడి, నిద్ర అన్నీ సరిగ్గా ఉన్నప్పుడే పిగ్మెంటేషన్ సమస్య తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

## డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యానికి విస్తృత ప్రచారం జయంతి సభలో డాక్టర్ పతికి రమేష్ నారాయణ



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** సుప్రసిద్ధ ఆధ్యాత్మిక వేత్త, కవి, డాకర్ ఉమర్ ఆలీషా సాహిత్యానికి విస్తృత ప్రచారం అవసరమని విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్ నారాయణ అన్నారు. శనివారం లలిత కళా పరిషత్ వేదికగా శ్రీ విశ్వ విజ్ఞాన విద్య విద్య – ఆధ్యాత్మిక పరము షష్టము పఠాధి పతులు 'కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 141 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ ఉమర్ ఆలీష సాహితీ సమితి జిల్లా అధ్యక్షులు షేక్ రియాజుద్దీన్ అహమ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆత్మీయ అతిధిగా విచ్చేసిన డాక్టర్ పతికి రమేష్ నారాయణ మాట్లాడుతూ కవిగా, పార్లమెంటు సభ్యునిగా, పీఠాధిపతులుగా బహుముఖ . ప్రజ్ఞతో తెలుగు భాషా సాహిత్యానికి విశేష కృషి చేశారన్నారు. కలమతాలకు అతీతంగా సూఫీ సిద్ధాంతంతో ఎంతో మందిని జ్ఞాన మార్గంలో నడిపించిన డాక్టర్ ఉమర్ ఆలీషా రచనలు చాలా మందికి అందుబాటులో లేకపోవడం విచారకర మన్నారు. అయితే భీమవరం దాకర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి వారు రాష్ట్రస్థాయి పోటీలు పెట్టడం ద్వారా కొంతలో కొంత వారి సాహిత్యానికి తగిన ప్రచారం లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. సాహిత్యం వ్యాప్తి చేయడానికి అందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా 7, 10 తరగతుల తెలుగు పాఠ్యాంశాలలో డాక్టర్ ఉమర్ ఆలీషా రచవలు చేర్చడంలో అనంతవాసుల కృషిని ప్రత్యేకించి అభినందించారు. అంతకు ముందు డాక్టర్ ఉమర్ ఆలీషా చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంతపురం ఆల్ ఇండియా రేడియో నుండి డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి సాహిత్య రచనలను పరిచయం చేస్తూ, ఆలపించిన పద్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి, డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి. ప్రధాన కార్యదర్శి గుంటి మురళీ కృష్ణ, కార్యదర్శి సుంకర రమేష్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ నగరూరు రసూల్, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టి. వి. రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ బడా శ్రీనివాస రెడ్డి, అనంతపురం మాసపత్రిక ఎడిటర్ తోట నాగరాజు, విశాలాంధ్ర విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న, కళాకారులు కెపోమిరెడ్డి, జెకె రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులు శివ, కళాకారులు జి.జె. ఎర్రిస్వామి, మల్లెల జయరామ్, ఉమర్ అలీషా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు శ్రీకాంత్, సుదర్శన్ రెడ్డి, కళాకారులు రామగోవిందు, వి ఆదినారాయణ రెడ్డి , అస్లాం భాష, లోకేష్, తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అకస్మాత్తుగా బరువు తగ్గారా?




మన మెడ భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఉండే థైరాయిడ్ గ్రంథి.. శరీర జీవక్రియలను నియంత్రించడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం మెడకు సంబంధించిన గ్రంథి మాత్రమే కాకుండా శరీర ఉష్ణోగ్రత, శక్తి ఉత్పత్తి, గుండె కొట్టుకోవడాన్ని క్రమబద్ధీకరిస్తుంది. హెల్థియన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సోహిని సేన్ గుప్తా వివరణ ప్రకారం థైరాయిడ్ గ్రంథి అధికంగా పనిచేయడం ప్రారంభించినప్పుడు శరీరంలోని మొత్తం వ్యవస్థ వేగవంతమవుతుంది. దీనివల్ల జీవక్రియల వేగం పెరిగి, కేలరీలు త్వరగా కరిగిపోతాయి. ఫలితంగా గుండె సాధారణం కంటే ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. రోగనిరోధక వ్యవస్థ పొరపాటున థైరాయిడ్ గ్రంథిని ప్రేరేపించడం వల్ల హార్మోన్ల ఉత్పత్తి మితిమీరి, శరీరం ఒక్కసారిగా 'ఓవర్ డ్రైవ్' మోడ్‌లోకి వెళ్తుంది. హైపర్ థైరాయిడిజం లక్షణాలు ప్రారంభంలో చాలా స్వల్పంగా ఉండటం వల్ల వీటిని గుర్తించడం కష్టమవుతుంది. సాధారణం కంటే ఎక్కువగా ఆకలి వేసినా లేదా ఆహారం బాగానే తీసుకుంటున్నా బరువు తగ్గిపోవడం దీని ప్రధాన లక్షణం. దీనికి తోడు చేతులు వణకడం, విపరీతమైన ఆందోళన, చిరాకు, నిద్రలేమి, చెమటలు పట్టడం, ఎండను ఏమాత్రం తట్టుకోలేకపోవడం లాంటి మార్పులు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఒకేసారి కాకుండా విడివిడిగా కనిపిస్తుండటంతో, చాలామంది వీటిని సాధారణ సమస్యలుగా భావించి, వైద్యులను సంప్రదించడంలో ఆలస్యం చేస్తుంటారు.

స్టెరిస్ హెల్త్‌కేర్ ఛైర్మన్ జీవన్ కాస్రా అభిప్రాయం ప్రకారం, బరువు తగ్గడం, గుండె వేగం పెరగడం ఒకేసారి జరుగుతుంటే ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదు. జీవక్రియలు మితిమీరిన వేగంతో సాగడం వల్ల గుండెతో పాటు ఇతర అంతర్గత అవయవాలపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. ఈ లక్షణాలు కేవలం థైరాయిడ్ వల్లనే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు, ఇన్ఫెక్షన్లు లేదా తీవ్రమైన మానసిక ఒత్తిడి వల్ల కూడా వచ్చే అవకాశం ఉన్నందున వైద్య పరీక్షలు తప్పనిసరి అవుతాయి. ఈ లక్షణాలను సకాలంలో గుర్తించకపోతే, దీర్ఘకాలిక హృద్రోగ సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

అయితే థైరాయిడ్ సమస్యను గుర్తించడం చాలా సులభమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒక సాధారణ రక్త పరీక్ష ద్వారా రక్తంలోని హార్మోన్ల స్థాయిలను కొలిచి, థైరాయిడ్ పనితీరును నిర్ధారించవచ్చు. వ్యాధి ముదరకముందే గుర్తిస్తే మందులు, జీవనశైలి మార్పులు, తగిన చికిత్స ద్వారా హార్మోన్ల ఉత్పత్తిని అదుపులోకి తెచ్చి గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. శరీరంలో చోటుచేసుకునే చిన్న మార్పులైనా అవి నిరంతరంగా కొనసాగుతుంటే, వాటిని విస్మరించకుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడమే ఉత్తమం. ప్రారంభ దశలోనే స్పందించడం వల్ల గుండె ఆరోగ్యాన్ని రక్షించుకోవడమే కాకుండా, దీర్ఘకాలిక అనారోగ్యాల నుండి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

## మీ పిల్లలు యూట్యూబ్ షార్ట్స్ ఎక్కువగా చూస్తున్నారా




నేటి తరంలో పిల్లలు స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్ ఎక్కువగా చూస్తున్నారు. దీనివల్ల వారి కంటిచూపు మందగించే అవకాశం ఉంది. ఇతర అనారోగ్య, మానసిక సమస్యలు కూడా తలెత్తవచ్చు. ఇదంతా తెలిసినా కూడా పిల్లలచేత షార్ట్స్ వీడియోస్ చూసే అలవాటు మాన్పించడం కష్టం. ఇలాంటివారి కోసమే ఇప్పుడు యూట్యూబ్ ఒక కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. ఈ ఫీచర్ ద్వారా పిల్లలు రోజూ ఎంతసేపు షార్ట్స్ చూస్తున్నారో తెలుసుకోవచ్చు. అంతేకాదు.. వారు షార్ట్స్ చూసే టైమ్ లిమిట్ సెట్ చేయవచ్చు. అంటే యూట్యూబ్ లో పిల్లలు ఎక్కువ సేపు షార్ట్స్ చూడకుండా ఈ ఫీచర్ ద్వారా నియంత్రించవచ్చు. దీనికోసం మీ మొబైల్ ఫోన్లో యూట్యూబ్ యాప్ ఓపెన్ చేసి, టాప్ రైట్ కార్నర్లో ఉన్న ప్రొఫైల్ పిక్చర్ పై ట్యాప్ చేసి, సెట్టింగ్స్ మెనూ ఎంచుకోవాలి. ఆ తర్వాత జనరల్ సెలెక్ట్ చేసుకుని, షార్ట్స్ ఫీడ్ లిమిట్ ఎంచుకోవాలి.

ఆ తర్వాత ఎంత సేపు షార్ట్స్ చూడాలనుకుంటున్నారో ఆ టైమ్ సెలెక్ట్ చేసుకోవాలి. ఒకసారి టైమ్ లిమిట్ సెలెక్ట్ చేసుకున్న తర్వాత ఇకపై షార్ట్స్ అంతకుమించి చూడటానికి వీలు లేదు. టైమ్ లిమిట్ పూర్తైతే స్క్రీన్ పై నోటిఫికేషన్ వస్తుంది. మళ్లీ చూడాలనుకుంటే మాత్రం తిరిగి కంటిన్యూ చేయొచ్చు. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, ఐఓఎస్ డివైజెస్ పై ఈ ఫీచర్ పని చేస్తుంది.

## ఇన్‌స్టాగ్రామ్ యూజర్లకు గుడ్ న్యూస్..



ఇన్‌స్టాగ్రామ్ యూజర్లకు, రీల్స్ క్రియేటర్లకు గుడ్ న్యూస్. కంటెంట్ ఏ భాషలో ఉన్నా ఇకపై మరో ఐదు భారతీయ భాషల్లో డబ్ చేసుకునే వీలుంటుంది. ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్య సంస్థ మెటా ఈ మేరకు ఒక ఏఐ టూల్ ను డెవలప్ చేసింది. ముంబైలో జరిగిన హౌజ్ ఆఫ్ ఇన్‌స్టాగ్రామ్ ఈవెంట్లో ఈ ఫీచర్ను ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్ భారతీయ క్రియేటర్లకు, యూజర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపింది. ఈ ఫీచర్ గత ఏడాది నవంబర్లో ప్రకటించగా, ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ఇకపై కంటెంట్ ను ఏ భాష నుంచైనా తెలుగుతోపాటు తమిళం, బెంగాలీ, కన్నడ, మరాఠి భాషల్లోకి డబ్ చేసుకోవచ్చు. ఇప్పటికే హిందీ, ఇంగ్లీష్, స్పానిష్, పోర్చుగీస్ భాషల్లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. మరికొద్ది రోజుల్లో ఇన్‌స్టాగ్రామ్ తోపాటు ఫేస్ బుక్ లో కూడా ఈ ఫీచర్ అందుబాటులోకి రానుంది. ఈ డబ్బింగ్ లిప్ సింక్ కు అనుగుణంగా కూడా ఉండనుంది. డబ్బింగ్ భాషల్లో కూడా చాలా స్పష్టమైన ఉచ్చారణతో, కచ్చితత్వంతో రీల్స్ చూడొచ్చు. వాయిస్ డబ్బింగ్ మాత్రమే కాకుండా.. ఫాంట్స్ కూడా వేరే భాషలోకి మార్చుకోవచ్చు.

రీల్స్ పై వచ్చే ఫాంట్స్ ను హిందీ, మరాఠి, బెంగాలి, అస్సామీ భాషల్లోకి మార్చుకోవచ్చు. ఇందుకోసం ఎడిట్స్ లో అప్డేట్ చేసుకోవాలి. అయితే, ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ ఫీచర్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందని మెటా తెలిపింది. ఇప్పటికే మెటా సంస్థ ఇన్‌స్టాగ్రామ్ యూజర్ల కోసం కొన్ని కొత్త ఫీచర్లను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫొటో, వీడియోల రీ స్టైల్, బల్క్ క్యాప్షన్ ఎడిటింగ్, వీడియో రివర్సింగ్ టూల్స్, 400 న్యూ సౌండ్ ఎఫెక్ట్స్ ను తీసుకొచ్చింది.

## వాట్సాప్‌లో ఇక జాతరే.. గ్రూప్ చాటింగ్



మనం వాడే వాట్సాప్ గ్రూప్స్‌లో ఇప్పుడు 1,024 మంది వరకు సభ్యులు ఉండే అవకాశం ఉంది. అయితే ఇంత పెద్ద గ్రూప్‌లో ఎవరు ఎవరో గుర్తుపట్టడం, ముఖ్యమైన ఈవెంట్లను ఫాలో అవ్వడం కొన్నిసార్లు తలనొప్పిగా మారుతుంది. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ మెటా సంస్థ మూడు అద్భుతమైన ఫీచర్లను తీసుకొచ్చింది. గ్రూప్ చాటింగ్ అనుభవాన్ని పూర్తిగా మార్చేసేలా ఈ అప్‌డేట్లు ఉన్నాయి. వీటిలో ఒకటి 'మెంబర్ ట్యాగ్స్'.. దీనితో గ్రూప్ సభ్యులకు మనకు నచ్చిన పేర్లు లేదా ట్యాగ్స్ ఇచ్చుకోవచ్చు. 'అన్నా' 'డ్యూడ్' లేదా వారి రోల్‌ను బట్టి 'గోల్ కీపర్'.. లాంటి కస్టమ్ లేబుల్స్ ఇచ్చుకోవచ్చు. దీంతో వందల మందిలో మనకు కావలసిన వ్యక్తిని సెర్చ్ చేయడం ఈజీ అవుతుంది. రెండు 'టెక్స్ట్ స్టికర్స్'.. మీరు టైప్ చేసిన పదాన్ని వెంటనే స్టికర్‌గా మార్చుకోవచ్చు.

ఇక మూడు 'ఈవెంట్ రిమైండర్స్'.. గ్రూప్‌లో ఏ ఈవెంట్ ఉన్నా ముందే రిమైండర్ సెట్ చేసుకోవచ్చు. ఈ అప్‌డేట్లు 1000 మందికి పైగా సభ్యులు ఉన్న పెద్ద గ్రూప్‌లలో మన పనిని చాలా ఈజీ చేస్తాయి. 2జీబీ వరకు ఫైల్ షేరింగ్, హెచ్‌డీ మీడియా, స్క్రీన్ షేరింగ్ లాంటి ఫీచర్లతో వాట్సాప్ తన గ్రూప్స్‌ని మరింత పవర్‌ఫుల్‌గా మార్చేసింది. ఎప్పటిలాగే ఈ మెసేజ్‌లన్నీ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో సురక్షితంగా ఉంటాయి.

## కెరీర్‌లో రాణించడానికి నేర్చుకోవాల్సిన ఐదు నైపుణ్యాలు ఇవే..!: లింక్డ్ఇన్




నేటి యువ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు... "తర్వాత ఏం నేర్చుకోవాలి?" అని నిర్ణయించుకోవడమే. లింక్డ్ఇన్ తాజా డేటా ప్రకారం, వేగంగా మారుతున్న సాంకేతికతకు మరియు నేటి ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలకు తాము సిద్ధంగా లేమని 38% మంది భారతీయ ఉద్యోగార్థులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఉద్యోగార్థులకు సహాయపడటానికి మరియు వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి... లింక్డ్ఇన్ తన 'స్కిల్స్ ఆన్ ది రైజ్ 2026' నివేదికను విడుదల చేసింది. సంస్థలు, పరిశ్రమల అంతటా వేగంగా వృద్ధి చెందుతున్న ఐదు నైపుణ్యాల సమూహాలను ఇది హైలైట్ చేసింది. అవి: ఏఐ అండ్ ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్, ఐటీ అండ్ సైబర్ సెక్యూరిటీ, బిజినెస్ అండ్ గ్రోత్, పీపుల్ అండ్ లీడర్‌షిప్.

లింక్డ్ఇన్ డేటా ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రిక్రూటర్లలో 46% మంది ఇప్పుడు సరైన అభ్యర్థులను ఎంచుకోవడానికి నైపుణ్యాల డేటా పైనే ఆధారపడుతున్నారు. అయినప్పటికీ, అర్హత కలిగిన నైపుణ్యం గల వారిని కనుగొనడం మునుపటి కంటే ఇప్పుడు మరింత కష్టంగా మారిందని భారతదేశంలోని 74% రిక్రూటర్లు చెబుతున్నారు. ఏఐ (ూ×) సాధనాలతో పనిచేయగల, డేటాను విశ్లేషించి అన్వయించగల, డిజిటల్ సిస్టమ్‌లను అర్థం చేసుకుని కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచగల నిపుణులకు అన్ని పరిశ్రమలలో డిమాండ్ పెరుగుతోంది.

అయితే, కేవలం సాంకేతిక సామర్థ్యం ఒక్కటే సరిపోదు. జట్లు మరింత 'క్రాస్-ఫంక్షనల్'గా 'ఏఐ-ఎనేబుల్డ్'గా మారుతున్న కొద్దీ... సాంకేతిక పరిజ్ఞానాన్ని కొలవగల ప్రభావంగా మార్చడానికి... సహకారం, వాటాదారుల నిర్వహణ, ప్రాజెక్ట్ నాయకత్వం వంటి వ్యక్తిగత నైపుణ్యాలు కూడా అత్యంత అవసరం.

ఈ మేరకు లింక్డ్ఇన్ కెరీర్ ఎక్స్‌పర్ట్ అండ్ ఇండియా సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నిరాజితా బెనర్జీ మాట్లాడుతూ, "కొన్నేళ్లుగా యువ నిపుణులకు ఏదైనా ఒక రంగంలో ప్రత్యేకత సాధించమని చెబుతూ వచ్చారు. కానీ 2026లో ఆ నియమం మారుతోంది. నేడు సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్న అభ్యర్థులు కేవలం ఒకే రంగంలో నిపుణులు కాదు... వారు విభిన్న నైపుణ్యాలను కలబోసిన వారు అయి ఉండాలంటోంది. ఏఐ (ూ×)తో ఎలా పనిచేయాలో, డేటాను ఎలా విశ్లేషించాలో, పనితీరును ఎలా మెరుగుపరచాలో వారికి తెలుసుండాలి.

వీటన్నింటికీ మించి, వివిధ బృందాలతో కలిసి ఎలా పనిచేయాలో కూడా వారికి తెలుసుండా. ఈ నైపుణ్యాలు అందిపుచ్చుకు్న వారికే ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో ఉద్యోగంతో పాటు ప్రమోషన్‌ను కూడా తెచ్చిపెడుతుంది. ఈ మార్కెట్‌లో మీ అవకాశాలను మెరుగుపరుచుకోవాలనుకుంటే, విడివిడిగా ఉండే నైపుణ్యాల వెంట పడటం మానేసి... మీకంటూ ప్రత్యేకమైన 'స్కిల్స్ స్టాక్'ను నిర్మించుకోండి. దానినే మీ ప్రధాన పోటీతత్వంగా మార్చుకోండి," అని అన్నారు.

భారతదేశంలోని ఉద్యోగార్థులు తమ కెరీర్‌ను మార్చుకోవడానికి నేర్చుకోవాల్సిన ఐదు నైపుణ్యాలు ఏంటంటే..

1. ఏఐ అండ్ ఆటోమేషన్ – ఉత్పాదకతే కొత్త ప్రాతిపదిక: ఏఐ (ూ×) ని తమ రోజువారీ పనుల్లో భాగం చేసుకోగల నిపుణులు.. పనులను వేగంగా, విస్తృతంగా చేయగలుగుతారు. ఇంజనీరింగ్, ఐటీ రంగాల్లో వర్క్‌ఫ్లో ఆటోమేషన్, ూ అండ్ ఏపీఐ ఇంటిగ్రేషన్ (API integration) వంటి నైపుణ్యాలకు మంచి గిరాకీ ఉంది.

2. డేటా అండ్ అనలిటిక్స్ – విశ్లేషణ ఆచరణలోకి మారాలి: కేవలం డేటాను విశ్లేషించడమే కాకుండా.. ఆ డేటాలోని అంతరార్థాన్ని గ్రహించి, దానిని స్పష్టంగా వివరించి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగించగల నిపుణులకు యాజమాన్యాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి.

3. ఐటీ అండ్ సైబర్ సెక్యూరిటీ –: డిజిటల్ కార్యకలాపాలు విస్తరిస్తున్న తరుణంలో... టెక్నాలజీ వాతావరణాన్ని సురక్షితంగా ఉంచి, బలోపేతం చేయగల నిపుణులు స్థిరమైన వృద్ధికి కేంద్ర బిందువుగా మారుతున్నారు. ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల్లో సైబర్ సెక్యూరిటీ అత్యంత కీలకం కాగా... సంస్థల డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు మద్దతు ఇచ్చే కన్సల్టింగ్ విభాగాల్లో 'క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' నైపుణ్యాలకు గిరాకీ పెరుగుతోంది.

4. బిజినెస్ అండ్ గ్రోత్: పనితీరును మెరుగుపరుస్తూనే సంస్థ వృద్ధికి తోడ్పడే నిపుణులకు యాజమాన్యాలు తగిన గుర్తింపును ఇస్తున్నాయి. బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ సేల్స్‌లో 'రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్'కు డిమాండ్ పెరుగుతోంది. అలాగే ఆదాయ సంబంధిత విభాగాల్లో 'నెగోషియేషన్' అనేది ప్రధాన సామర్థ్యంగా కొనసాగుతోంది.

5. పీపుల్ అండ్ లీడర్‌షిప్: బిజినెస్ డెవలప్‌మెంట్, సేల్స్, ఇంజనీరింగ్, విద్య, ఆర్ట్స్ అండ్ డిజైన్, ఐటీ, కన్సల్టింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్ అండ్ మార్కెటింగ్ వంటి అనేక రంగాల్లో 'కొల్లాబరేషన్' అనేది నిలకడగా కనిపిస్తోంది. వేర్వేరు జట్లు ఎలా పనిచేస్తున్నాయో ఇది స్పష్టం చేస్తోంది. పనులు మరింతగా ఏఐ (ూ×) ఆధారితంగా, క్రాస్-ఫంక్షనల్‌గా మారుతున్న కొద్దీ... వ్యక్తులను సమన్వయం చేయడం, సంక్లిష్టతలను నిర్వహించడం, సమిష్టిగా ఫలితాలను రాబట్టడం అనేవి ఉద్యోగావకాశాలను నిర్ణయించే ప్రధాన నైపుణ్యాలుగా మారుతున్నాయి.

చివరగా ఈ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి సహాయపడేలా... లింక్డ్ఇన్ కొన్ని ఎంపిక చేసిన 'లింక్డ్ఇన్ లెర్నింగ్' కోర్సులను మార్చి 31, 2026 వరకు ఉచితంగా అందిస్తోంది. వీటిలో 'ఏఐ ఏజెంట్స్ ఫర్ ఎవ్రీడే ప్రొఫెషనల్స్', 'లెర్నింగ్ డేటా అనలిటిక్స్', 'స్టేక్‌హోల్డర్ మేనేజ్‌మెంట్ ఫర్ లీడర్స్ అండ్ మేనేజర్స్' వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

# గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలి



**సాలూరు విశాఖ సమాచారం** పాచిపెంట మండలం కుడుమూరు సర్వేనెంబర్ 48 లో సుమారు 782 ఎకరాలు గిరిజనులు సాగు చేస్తున్నారని కుడుమూరు భూ పోరాట కమిటీ కన్వీనర్ ఎస్ అప్పలస్వామి తెలిపారు విలేకరులతో మాట్లాడుతూ తాత ముత్తాతల నుండి వంశపార పర్యాయంగా భూములను గిరిజనుల సాగు చేస్తూ పంటలు పండించుకోవడం జరుగుతుందని అన్నారు నేటి వరకు భూములకు పట్టాలు లేని కారణంగా ప్రభుత్వము నుండి వచ్చేనా రాయితీలు గిరిజనులకు అందడం లేదని అప్పలస్వామి తెలిపారు రెవెన్యూ అధికారులు స్పందించే పట్టాలు మంజూరు చేస్తే భూమి అభివృద్ధి పథకం కింద ఉపాధి పనులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు అధికారులు స్పందించి గిరి పుత్రులకు న్యాయం చేయాలని గిరిజనులు కోరుతున్నారు ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకుడు కోరాడ ఈశ్వరరావు భూ పోరాట కమిటీ సభ్యులు కళ్యాణ్ జానకిరామ్ గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు

# పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి సంధ్యారాణి



**సాలూరు విశాఖ సమాచారం** మున్సిపల్ పరిధిలో 28వ వార్డు పెద్ద కోమటిపేటలో గిరిజన శాఖ మంత్రి జి సంధ్యారాణి వృద్ధులకు వికలాంగులకు పెన్షన్లు శనివారం ఉదయం పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వృద్ధులకు నెల చివర రోజున పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు శనివారం బ్యాంకు సెలవు దినము అయినా ముందు రోజు డబ్బులు డ్రా చేసి అధికారులు వృద్ధులు ఇంటి దగ్గరికి వచ్చి పెన్షన్లు అందజేస్తున్నారని అన్నారు అన్ని రంగాల వారికి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు ఈ పంపిణీ కార్యక్రమానికి సాలూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెమ్మది చిట్టి టిడిపి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఇంటి పన్నులు వసూలు చేయాలని అధికారులు పనితీరుపై ధ్వజమెత్తిన కౌన్సిలర్స్



## వాడిగా వేడిగా సాలూరు మున్సిపల్ సమావేశం

**సాలూరు ఫిబ్రవరి విశాఖ సమాచారం:** సాలూరు మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు ఖాళీ స్థలాలపై పన్నులు వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వస్తున్నారని అధికారులు పనితీరుపై కౌన్సిలర్స్ మండిపడ్డారు శనివారం ఉదయం మున్సిపల్ చైర్ పర్సన్ పి ఈశ్వరమ్మ అధ్యక్షతన సాలూరు మున్సిపల్ సాధారణ సర్వసభ సమావేశం జరిగింది ఈ సందర్భంగా 22 వ వార్డు కౌన్సిలర్ గిరి రఘు మాట్లాడుతూ కొన్ని దినపత్రికల్లో మున్సిపల్ ఆదాయానికి రాజకీయ నాయకులు గండి కొడుతున్నారని పత్రికలో ప్రచురించడం జరిగిందని అన్నారు గత మున్సిపల్ సమావేశంలో పాలకవర్గం అంతమంది తీర్మానం చేసి ఇంటి పన్నులు ఖాళీ స్థలాలపై పన్నులు వసూలు చేయాలని అజెండాలో తీర్మానం చేయడం జరిగిందని రఘు అన్నారు మున్సిపల్ రెవెన్యూ అధికారులు పన్నులు వసూలు చేయకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని అధికారులు పనితీరుపై మండిపడ్డారు రాజకీయ నాయకులు షాపు యజమానులు బేధాలు లేకుండా అందరి వద్ద ఇంటి పన్నులు వసూలు చేయాలని అన్నారు పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించలేదని వెంటనే వారికి జీతాలు చెల్లించాలని అన్నారు 25 వ వార్డు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు మాట్లాడుతూ ట్రాక్టర్లు జెసిబి డ్రైవర్ పోస్టులు రెగ్యులర్ చేయాలని అన్నారు మున్సిపల్ అధికారులు ప్రైవేట్ టెండర్స్ పిలిచి కాంట్రాక్ట్ పద్ధతిపై డ్రైవర్ పోస్టులు వేయడానికి అధికారులు టెండర్లు వేయడం జరిగిందని అన్నారు ఉన్నవారిని రెగ్యులర్ చేయాలని అన్నారు 25 వ వార్డు మురికి వాడలు ఇల్లు శిథిలా వ్యవస్థలో చేరుకున్నాయని అన్నారు 1983 సంవత్సరంలో దళితులకు అప్పటి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని అన్నారు శిథిలావస్థకు చేరుకోవడంతో దళితులు భయంతో జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు 25 వార్డులో తాగునీరు సౌకర్యములాగా వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు గత సమావేశంలో అధికారులకు తెలియజేసిన నేటి వరకు సమస్య పరిష్కారం కావడం లేదని అధికారులు పనితీరుపై మండిపడ్డారు మున్సిపల్ అధికారులు బంగారమ్మ కాలనీ రామా కాలనీ వెంకటేశ్వర కాలనీ ఖాళీ స్థలాలపై పన్నులు వసూలు చేయాలని అన్నారు మున్సిపల్ ఆదాయానికి అధికారులు సహకరించాలని 25 వ వార్డు కౌన్సిలర్ ఎస్ ఈశ్వరరావు తెలియజేశారు కమిషనర్ మాట్లాడుతూ దళితవాడలో అభివృద్ధికి కార్యచరణ చేయడం జరిగిందని వార్డుల్లో తాగునీరు మురికివాడలో అభివృద్ధికి కాలువలు నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు సమావేశానికి ముందుగా సిఐటియు నాయకులు నాయుడు నాయకత్వంలో పారిశుధ్య కార్మికులు సమావేశం జరగనివ్వకుండా ముందుగా మున్సిపల్ ప్రధాన గేటు వద్ద పాలకవర్గ సభ్యులను అడ్డుకోవడం జరిగింది పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు జీతాలు చెల్లిస్తామని కార్మికులకు అధికారులు హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు అనంతరం సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి వైసీపీ టిడిపి కౌన్సిలర్స్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఐస్ అయిపోవద్దు!



**అమలాపురం కలెక్టరేట్:** వేసవి సమీపించింది. పండ్ల రసాలు, మజ్జిగతో తయారు చేసిన చల్లటి పానీయాలు తాగేందుకు ప్రజలు మక్కువ చూపుతారు. వీటికి వినియోగిస్తున్న ఐస్ ఎక్కడ తయారవుతోంది.. అందులో వాడే నీరు మంచిదేనా అన్న పర్యవేక్షణ కొరవడింది. జిల్లాలో చాలావరకు తయారీదారులు తుప్పు పట్టిన బాక్సుల్లో బోరు నీరునింపి ఐస్ తయారు చేస్తున్నారు. వీటినే దుకాణదారులకు యథేచ్ఛగా సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. వీటిపై అధికారులు కనీసం దృష్టిపెట్టని పరిస్థితి నెలకొంది.

ఇవీ నిబంధనలు

శుద్ధ జలంతోనే ఐస్ తయారు చేయాలి. నీటిలోని మలినాలు తొలగించేందుకు రివర్స్ ఆస్మాసిస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.

ఐస్ తయారీకి వినియోగిస్తున్న నీటిని పూర్తిస్థాయి పరీక్షలు చేసిన తరువాత వాటిలో టీడీఎస్, ఇతర లవణాల శాతాన్ని ఎప్పటికప్పుడు పరిరక్షించాలి.

తయారీకీ వినియోగించే బాక్సులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.

కార్మికుల చేతులకు కచ్చితంగా గ్లౌజ్‌లను వినియోగించాలి.

జిల్లాలో ఇలా..

అమలాపురంతో పాటు అల్లవరం, భట్నవిల్లి, ఓడలరేవు, రాజోలు, రామచంద్రపురం, ముమ్మిడివరం, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిల్లో అనధికారికంగా నడుస్తున్నవే చాలావరకు ఉన్నాయి. అధికారులు తనిఖీలకు వెళుతుంటే కేవలం మత్స్య ఉత్పత్తులు ప్యాకింగ్ చేసేందుకు వినియోగిస్తున్నామని చెబుతున్నారు. చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రతాధికారి రామయ్య తెలిపారు.

వివరాలు (రోజువారీ)

ఐస్ తయారీ కేంద్రాలు: 80

క్వింటాలు ధర: రూ.500–600

మత్స్యఉత్పత్తుల స్టోరేజీకి వినియోగం: 800–850 టన్నులు

జ్యూస్ షాపులకు విక్రయిస్తున్నది: సుమారు 500 కేజీలు

ఇతర అవసరాలకు: 1 నుంచి 2 టన్నుల వరకు

పెద్దలు, పిల్లల్లో తీవ్ర ప్రభావం

కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌లోని సూక్ష్మజీవుల వల్ల అతిసారం, టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లు, గ్యాస్ట్రిక్ సమస్యలు, గొంతు ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. నీటిలో ఫ్లోరైడ్ ఉంటే ఫ్లోరోసిస్, నైట్రేట్ శాతం ఎక్కువగా ఉంటే పిల్లలు బ్లూబేబీ సిండ్రోమ్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది.

డాక్టర్ పృథ్వీ, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, అల్లవరం సీహెచ్‌సీ

## జాతీయసైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరిపిన మాంటిస్సోరి స్కూల్



**తాళ్లపూడి విశాఖ సమాచారం: ప్రతినిధి (శివకృష్ణ )**

జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో సైన్స్ డే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు తమ అద్భుతమైన సృజనాత్మకత, ఆలోచనా శక్తి మరియు శాస్త్రీయ దృక్పథాన్ని ప్రదర్శిస్తూ ఎంతో ప్రతిభ చూపారని కరస్పాండెంట్ వివి అనీష్ తెలిపారు. వారి వినూత్న ఆలోచనలు, ప్రాయోగిక నమూనాలు మరియు పరిశోధనాత్మక ప్రాజెక్టులు అక్కడికి వచ్చిన వారిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు తయారు చేసిన రోబో ప్రాజెక్టు, సోలార్ సిస్టం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వి. వి. అనీష్ విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత కొత్త ఆవిష్కరణలు చేయాలని , శాస్త్ర రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# గోదావరి జిల్లాల సమాచారమ్

## సైన్స్ డే సందర్భంగా ఆవిష్కరణల అద్భుత ప్రదర్శన



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని గైగోలుపాడు గ్రామంలోని మూర్తి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శాస్త్ర విజ్ఞానోత్సవ వాతావరణం నెలకొంది. ప్రిన్సిపాల్ పాలిక నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణా ప్రతిభను చాటుతూ వివిధ శాస్త్రీయ నమూనాలను ప్రదర్శించారు. మానవ శరీర నిర్మాణం హృదయ స్పందన విధానం రక్త ప్రసరణ వ్యవస్థ వంటి అంశాలను సజీవంగా వివరించడంతో పాటు ప్రకృతి సంరక్షణ, గ్రీన్ ఎనర్జీ, వర్షపు నీటి సంరక్షణ పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కిచెన్‌లో జరిగే రసాయనిక మార్పులు, ఆరోగ్యకర ఆహారం ప్రాముఖ్యత ఇంటి తోట ఏర్పాటు విధానం వంటి ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పునర్వినియోగ వస్తువులతో చేసిన వినూత్న ఆవిష్కరణలు, ప్లాస్టిక్ వ్యర్థాల దుష్ప్రభావాలపై రూపొందించిన ప్రాజెక్టులు చైతన్యాన్ని రేకెత్తించాయి. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసింహమూర్తి మాట్లాడుతూ పుస్తకాల పరిధిని దాటి ప్రాయోగిక అనుభవం ద్వారా నేర్చుకోవడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. అకడమిక్ డీన్ గౌతమి, వైస్ ప్రిన్సిపాల్స్ ఉమా, దీనా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైకాపా హయాంలో చేసిన పనులకు బిల్లుల బేరం



**కాకినాడ :** తెదేపా ప్రభుత్వంలో 2014–19 మధ్య జల వనరులశాఖ పరిధిలో నీరు–చెట్టు పథకం కింద రూ.కోట్ల పనులు చేపట్టారు. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా పనులపై విచారణ చేపట్టి గుత్తేదారులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం వైకాపా హయాంలో చేసిన పనులపై విచారణ జరుగుతున్నా బిల్లుల చెల్లింపులు మాత్రం జరిగిపోతున్నాయి. కాకినాడ నగర పాలక సంస్థలో జరుగుతున్న వ్యవహారాలే ఇందుకు ఉదాహరణ.

గత వైకాపా ప్రభుత్వంలో కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. సాధారణ నిధులు, స్మార్ట్ సిటీ గ్రాంట్లతో 2019–24 మధ్య చేపట్టిన పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఇలాంటి సమయంలో ఆయా పనులకు సంబంధించిన బిల్లులు, బకాయిల చెల్లింపులు చేయకూడదు. కానీ కోర్టులో గుత్తేదారులు కేసులు వేస్తున్నారని సాకుగా చూపించి వారికి సొమ్ములు చెల్లించేలా అధికారులు దస్త్రాలు నడుపుతున్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేసే అవకాశం ఉన్నా చేయడం లేదు.

కార్పొరేటర్లే గుత్తేదారులుగా..

వైకాపా హయాంలో కొందరు కార్పొరేటర్లే గుత్తేదారులుగా అవతారం ఎత్తారు. ముఖ్యంగా అప్పటి నియోజకవర్గ ప్రజాప్రతినిధితో సన్నిహితంగా మెలిగిన కొన్ని డివిజన్ల కార్పొరేటర్లకు భారీగా పనులు మంజూరుచేశారు. అరకొరగా ఉన్న జనరల్ ఫండ్స్‌ను ఊడ్చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పనులపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్‌తో విచారణ చేపట్టారు. రెండు నెలలు కిందటే ఈ పనులకు సంబంధించిన దస్త్రాలను పంపించాలని విజిలెన్స్ అధికారులు కేఎంసీకి లేఖ రాశారు. వీటితో సంబంధం లేకుండా వైకాపా గుత్తేదారులకు బిల్లులు చెల్లింపులు చేస్తుండడం విశేషం.

అధికారుల సలహాలతోనే..

నగరపాలక సంస్థలో కొంతమంది అధికారులు చాలాకాలంగా పాతుకుపోయి ఉన్నారు. వారిలో కొందరు ఇప్పటికీ వైకాపా నేతలకు అనుకూలంగా వ్యవహారాలు సాగిస్తున్నారు. విజిలెన్స్ విచారణలో ఉన్న పనులకు బిల్లులు చెల్లించేలా మార్గం చూపింది కూడా ఓ ఇంజినీరింగ్ అధికారేనని ఆరోపణలున్నాయి. మీ బిల్లు కోసం కోర్టులో ఒక కేసు వేయండి మిగతా కథ అంతా నేను నడుపుతానని అభయమిచ్చినట్లు సమాచారం. ఇప్పటికి 160 పనులపై గుత్తేదారులు కోర్టులో పిటిషన్లు వేయడం గమనార్హం. దీనిపై కేఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ విజిలెన్స్ విచారణలో ఉన్నవాటికి బిల్లులు ఇవ్వడం లేదని, కోర్టు నుంచి వచ్చిన ప్రతి పిటిషన్‌ను పరిశీలించే కౌంటర్ వేస్తున్నట్లు పేర్కొన్నారు.

# యూనివర్సిటీలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పండి




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనలపై వేసిన శాంతి కమిటీ మెంబర్స్ (కాన్స్టిట్యూట్ కాలేజీ ప్రిన్సిపల్స్), రేక్టార్, రిజిస్ట్రార్ మరియు చైర్మన్ (వైస్ ఛాన్సలర్)ను ఈ రోజు 28.02.2026 శనివారం ఆంధ్ర యూనివర్సిటీ అంబేద్కరైట్ అసోసియేషన్ కలసి వినతి పత్రాన్నీ సమర్పించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు బయట వ్యక్తుల నుండి రక్షణ కల్పించాలని అదే విధంగా ఎటువంటి మతపరమైన కార్యకలాపాలను యూనివర్సిటీలో చేపట్టకూడదని ఆంధ్ర యూనివర్సిటీలో అకాడమిక్ మరియు పరిశోధనల వాతావరణాన్ని రాజ్యాంగ విలువలతో కూడిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమన్యాయం, సెక్యులరిజం కలిగిన వాతావరణన్నీ బలోపేతం చేయాలని విద్యార్థులను విడదీసీ, విద్యార్థుల మధ్య అశాంతినీ సృష్టించే ఏ కార్యక్రమాలను నిర్వహించకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు పరిశోధకులు పాల్గొన్నారు. డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, డాక్టర్ వుండ్రుకొండ హరీష్ బాబు, డాక్టర్ కొండపల్లి రతన్ రాజు, డాక్టర్ మారపట్ల మణి శేఖర్, డాక్టర్ బి లక్ష్మణ్, డాక్టర్ దేవానందం, డాక్టర్ మృత్యుంజయ్, డాక్టర్ తమనం శిరీష్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ దాసు, డాక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు : వికసిత భారత్ జీ రాంజీ

**తాళ్లపూడి మండలం : విశాఖ సమాచారం: ప్రతినిధి (శివకృష్ణ ) :** మార్చిన ప్రభుత్వం కొన్ని ప్రధాన అంశాలను అవగాహన కల్పించేలా 6 వారాల పాటుకార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తాళ్లపూడి ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో మార్పు చేసిన అంశాలను వివరించారు .వాటిలో 125 రోజులు వేతన ఉపాధి హామీ, శక్తివంతమైన నిరుద్యోగ భృతి ఏర్పాటు ,నిర్ణీత సమయంలో చెల్లింపులు ఆలస్యానికి పరిహారం, గ్రామ సభ ద్వారా పంచాయత్ ప్రణాళిక, వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో అన్ని పథకాలను అనుసంధానం, సాంకేతిక పరిజ్ఞానంతో శక్తివంత, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతి గ్రామంలో సదస్సులను ఏర్పాటు చేసి కరపత్రాలు పంచడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఏపీవో రమాదేవి పాల్గొన్నారు



# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో భాగంగా గుమ్మ కోట. గరుగుబిల్లి పంచాయతీలలో పర్యటన

**తెలుగుదేశం పార్టీ అరకు ఇన్చార్జి. ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ సియారి దొన్ను దొర**



**అనంతగిరి విశాఖ సమాచారం** న్యూస్ అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. శనివారం నాడు మండలంలో గుమ్మ కోట. గరుగుబిల్లి. నాన్ షెడ్యూల్ ప్రాంతాలైన పంచాయతీలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొంటూ పలు సమస్యలు తెలుసుకున్నారు గరుగుబిల్లి పంచాయితీ గ్రామానికి రెండు కిలోమీటర్లు దూరంనకు రోడ్ సౌకర్యం లేక ఆ గ్రామ గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎవరికైనా వ్యాధులు సంభవిస్తే కనీసం 108 వాహనంపై తీసుకురావాలన్న గ్రామ సమీపంలో వాగు ఉండడం వల్ల వాహనాలు రాకపోకలు సాగవు ఈ వాగుకి బ్రిడ్జి నిర్మించి రోడ్ సౌకర్యం కల్పించాలని ఇన్చార్జి వారికి రోడ్డుపై పైడిపర్తి గ్రామస్తులు అటాయించి విజ్ఞప్తి చేశారు ఆయన స్పందించి ఆర్డబ్ల్యూ పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడి పైడిపర్తి రహదారి బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని ఆయన ఆదేశించారు ఇన్చారి వారి ఆదేశాల మేరకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే పనులు మొదలు పెడతామని అన్నారు అదేవిధంగా కుమ్మకోట గ్రామంలో ఇంటింటికి టెన్షన్ కార్యక్రమంలో పాల్గొంటూ అర్హులైన వృద్ధులకు వితంతులకు మూగ చెవిటి వికలాంగులకు. రక్తహీనత రోగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఇస్తూ గరుగుబిల్లి గ్రామంలో సభను ఏర్పాటుచేసి ఎన్టీఆర్ భరోసా ఫంక్షన్ పొందుటకు వచ్చిన పెన్షన్ దారులతో మాట్లాడుతూ ఈ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వీటిని సంయోగంపరచుకొని వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకోవాలని అప్పుడే పలు అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు మీ గ్రామాలకు అందుతాయని. ఆయన అన్నారు గత ప్రభుత్వం వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పెన్షన్ ఇవ్వడానికి జగన్మోహన్ రెడ్డి సంవత్సరానికి ₹250 చొప్పున నాలుగు సంవత్సరాలు పూర్తి చేసి నెలకు 3000 రూపాయలు చొప్పున ఫంక్షన్ ఇచ్చే వారిని ఇప్పుడైతే తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒకేసారి నాలుగు వేల రూపాయలు ఇస్తుందని అన్నారు కూటమి ప్రభుత్వము వచ్చి వితంతువులకు వృద్ధులకు నాలుగు వేల రూపాయలు. మూగ చెవిటి గుడ్డివారికి వికలాంగులకు 6000 రూపాయలు రక్తహీనత గల యాదిగ్రస్తులకు 10,000 చొప్పున అందజేస్తుందని ఆయన అన్నారు ఇంత మంచి ఆలోచన తో ఆలోచించి మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు అండగా ఉండి ఎన్టీఆర్ భరోసా వస్తుందని అదేవిధంగా గరుగుబిల్లి గ్రామపంచాయతీలో కొద్ది కుటుంబాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారు కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు అభివృద్ధి పనులు బాగున్నాయని తెలుగుదేశం పార్టీలో సియారి దొన్ను దొర ఆధ్వర్యంలో షేర్ఇట్లుగా తెలిపారు అదేవిధంగా కాశిపట్నం పంచాయతీ సీతంపేట గ్రామంలో అందరు వెళ్ళినప్పుడు ఆ గ్రామ ప్రజలు గ్రామంలో ఉన్న సమస్యల విషయమై తెలిపారు రహదారి సమస్య కాశీ పట్టణం నుండి సీతంపేట కు వెళ్లాలంటే గ్రామం దగ్గర పెద్ద ఏరు దాటి వెళ్ళవలసి ఉంటుంది వర్షాకాలం వస్తే పెద్ద వాగు వచ్చే వాగు దాటుతకు ప్రమాదకరంగా ఉంటుందని ఈ వాగుకు బ్రిడ్జి నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు సీతంపేట గ్రామ సమస్యల కొరకు పై అధిష్టానికి తెలియపరచి సమస్యలు పరిష్కారనీకై కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అనంతగిరి పార్టీ మండల అధ్యక్షులు సోవేరి సుబ్బారావు. ఉపాధ్యక్షులు మజ్జి భీమరాజు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి. బిజెపి పార్టీ మండల అధ్యక్షులు అద్దాల సోమురాజు మాజీ ఎంపిటిసి కె కొండమ్మ. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు పాంగి రవీంద్ర. మండల్ క్లస్టర్ అధ్యక్షుల పాంగి సందీప్ ( బాబి ) బిడ్డ మహేష్ కొత్తూరు సర్పంచ్ సారా పంచడిసీతయ్య. జన్ని చిట్టిబాబు పంచల జన్ని పైడిరాజు పంచాయతీ అధ్యక్షుడు. పంచాలి సన్యాసిరావు గ్రామపంచాయతీ అధ్యక్షుడు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పి అప్పలస్వామి. కే సోము పంచాయతీ ఉపాధ్యక్షుడు. ఇంటి సూరిబాబు. మాజీ సర్పంచ్ అప్పలస్వామి. గన్నరావు. డి రామారావు. పి సింగరాజు. జై కన్నయ్య. ఈ శారద. పంచాలి రాము కాదూరి రవి. బి సన్నివేశదేముడు. సుర్రా వెంకటేష్. గ్రామపంచాయతీ సెక్రటరీ గౌస్యం. గ్రామపంచాయతీ మహిళా పోలీస్ భారతి తదితర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# భావి ఇంజినీర్లు.. నవ్య ఆవిష్కరణలు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఇంజినీరింగ్ విద్యార్థులు సృజనాత్మకత, వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టులు తయారుచేసి ప్రతిభ చాటారు. సమాజానికి ఉపయోగపడే అంశాలను రూపొందించి భళా అనిపించారు. డెంకాడ మండలం జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన 'ప్రాజెక్ట్ ఎక్స్‌పో' ఇందుకు వేదికైంది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టులతో ఆకట్టుకున్నారు. మణికరణ్, రాహుల్, కార్తిక్, సృజన (ఈసీఈ ద్వితీయ సంవత్సరం) సముద్రం, నదుల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు, ఆపద సమయాల్లో ఈ బోటు ఉపయోగపడుతుంది. ఫైబర్ గ్లాస్, రైజిన్, హార్డ్‌వేర్ పరికరాలైన ఈఎస్‌పీ-32, లోరా, జీపీఎస్ సెన్సార్, ట్రాన్స్‌మీటర్ రిసీవర్, చేతి వాచ్, ప్లగ్ తదితరాలతో ఆరు నెలల పాటు శ్రమించి దీన్ని తయారు చేశారు. రూ.7 వేలు ఖర్చయిందని, బయట మార్కెట్‌లో దీని ధర రూ.40 వేలు వరకు ఉంటుందని విద్యార్థులు తెలిపారు. లెండి ఇంజినీరింగ్, జొన్నాడు(డెంకాడ) గౌతమ్, సోనిత, డానియల్, దీపిక(ఈసీఈ తృతీయ సంవత్సరం) కేతికతను ఉపయోగించి ప్రాజెక్టులను తయారు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో అభ్యున్నయ డిజిటల్ హబ్ కింద 10 లక్షల గ్రామాలను డిజిటల్, స్మార్ట్ విలేజ్‌లుగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ ద్వారా అన్ని వివరాలు అందుబాటులో ఉండేలా నమూనా పల్లెను తీర్చిదిద్దారు. లెండి కళాశాల, జొన్నాడ(డెంకాడ) శశాంక్, భార్గవ్, శ్రీను, సాయి, ధీరజ్, హాసిని(మెకానికల్ ద్వితీయ సంవత్సరం) ఈ కారు రేసింగ్, షికారుకు



స్మార్ట్ విలేజ్

ఉపయోగపడుతుంది. 48 వాట్ల డీసీ హెచ్‌పీ మోటార్, 3000 ఆర్‌పీఎం(చక్రాల వేగం), నాలుగు బ్యాటరీలు ఉపయోగించి రూపొందించారు. ఇందుకు రూ.లక్ష వరకు ఖర్చయినట్లు విద్యార్థులు తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ పెడితే.. గంటకు 35 కి.మీ. వేగంతో 20 కి.మీ. వరకు వెళ్తుందని చెబుతున్నారు.

# జాతీయ పతాకాన్ని తిరిగి పునరిద్దారించాలని ప్లకార్డులతో నిరసన



**అనకాపల్లి విశాఖ సమాచారం :** పట్టణం ప్రవేశ రహదారి మార్గం జంక్షన్ వద్ద నిరుపయోగముగా ఉన్న భారత జాతీయ పతాకాన్ని తిరిగి పునరిద్దారించాలని జాతీయ పతాక ప్రదేశం వద్ద సిద్దార్ధ సోషల్ సర్వీస్& కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లానాగభూషణము ఆధ్వర్యములో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన మరియు జి.వి.ఎమ్.సి.జోనల్ కమీషనర్ కార్యాలయ సూపర్నిటెం డెంట్ శ్రీ పి.అప్పల నాయుడు గారికి వినతిపత్రం ఈ దినం ఉదయం స్థానిక సిద్దార్ధ సోషల్ సర్వీసు& కల్చరల్ అసోసియేషన్,అధ్యక్షులు బల్లానాగభూషణము ఆధ్వర్యములో అనకాపల్లి పట్టణం నకు మార్గ సూచికగా అనకాపల్లి ప్రాముఖ్యత, విశిష్టత, ప్రాభవాన్ని తెలియజేయాలన్న ఆశయ స్పూర్తితో గత 4 స..ము.ల క్రితం అనకాపల్లి ప్రవేశ రహదారి మార్గము జంక్షన్ వద్ద అప్పటి జిల్లా కలెక్టర్ గారు ప్రభుత్వ సహాయ సహకారంతో సుమారు 40 లక్షల రూపాయలతో సుమారు 72 అడుగుల ఎత్తు తో గల జెండా పోల్ ను నిర్మించి దేశ గౌరవాన్ని పెంపొందించేలా అచ్చట భారత జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసి, అచ్చట లైటింగ్, పచ్చని వాతావరణము లతో బాటు పచ్చని చెట్లు రోడ్డు మార్గమును ఏర్పాటు చేసి అనకాపల్లి పట్టణ మార్గము సూచిక, అనకాపల్లి జిల్లా ప్రాభవాన్ని చాటి చెప్పాలన్న ఆశయ స్పూర్తితో ఎంతో ప్రతిష్టాత్మకముగా ఏర్పాటు చేయడం జరిగిందని , అయితే దురదృష్ట వశాత్తు గత రెండు స..ము.ల.కాలము నుండి అచ్చట గల భారత జాతీయ పతాకాన్ని పట్టించుకొనే వారులేక నిరుపయోగముగా, లైటింగ్ లేక, పిచ్చి మొక్కలు, తుప్పలతో , విష సర్పాలకు నిలయముగా మల, మూత్రాలకు ఆవాసముగా మారి తీవ్ర దురావస్థకు చేరుకొనడము అత్యంత అవమానకరము, బాధాకరం, విచారకరమని ఆవేదనను వెలిబుచ్చుతూ ఇప్పటికైనా తక్షణమే ఈ విషయముపై స్పందించి అచ్చట పూర్వ వైభవమును తీసుకు వచ్చేలా భారత జాతీయ పతాకము నిత్యము ఎగుర వేసేలా అలాగే ఆ ప్రదేశం లో పూర్వం వలే లైటింగ్, పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణం రోడ్డు మార్గం ను పునరుద్ద రించి భారత జాతీయ పతాక గౌరవాన్ని, ప్రతిష్టతను, సర్వభౌమత్వాన్ని పెంపొందించాలని, అలాగే అనకాపల్లి జిల్లా ప్రాముఖ్యత, .ప్రాభవాన్ని చాటిచెప్పేలా తక్షణమే ఈ విషయముపై తగుచర్యలు చేపట్టాలని ప్లకార్డులతో నిరసన .ప్రదర్శన చేపట్టి, తదుపరి జి.వి.ఎమ్.సి.జోనల్ కమీషనర్ కార్యాలయములో కార్యాలయ సూపర్న్0డెంట్ శ్రీ పి.అప్పల నాయుడు గారికి వినతిపత్రం అందజేసామని సంస్థ అధ్యక్షులు , భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత బల్లానాగభూషణము ఈ సందర్భముగా తెలియజేసారు. ఈ విషయముపై జిల్లా కలెక్టరు శ్రీమతి కె.విజయక్రిష్ణన్ గారు, ఆర్.డి.ఓ. షేక్ ఆయేషా గారు, జి.వి.ఎమ్.సి.కమీషనర్ శ్రీ కె.చక్రవర్తిగారు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ తుహిన్ సిన్హా గారు, స్థానిక పార్లమెంట్ సభ్యులు శ్రీ సి.ఎమ్.రమేష్ గారు, మాజీమంత్రి వర్యులు ఎమ్.ఎల్.ఏ.శ్రీ కొణతాల రామకృష్ణగారు, రాష్ట్ర హోమ్ మంత్రి వర్యులు శ్రీమతి వంగలపూడి అనిత గారు, రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి వర్యులు శ్రీ కందుల దుర్గేష్ గారు తక్షణమే స్పందించి భారత జాతీయ పతాకాన్ని పునరుద్ధరించి దేశ గౌరవాన్ని, భరత జాతి గౌరవాన్ని పెంపొందించేలా , ప్రజలలో దేశ భక్తిని చాటి చెప్పేలా కృషి చేయాలని బల్లానాగభూషణము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో సిద్దార్ధ అసోసియేషన్ కార్య దర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, పొట్టి శ్రీరాములు భవన్ సంస్థ అధ్యక్షుడు పిరాట్ల నరసింహమూర్తి, జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బుగిడి నూకప్పారావు పాల్గొన్నారు.

# బడుల్లో అందుబాటులో లేని తాగునీటి ప్లాంట్లు



**అనకాపల్లి, విశాఖసమాచారం:** అనకాపల్లి :కూండ్రం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు మంజూరైన శుద్ధయంత్రాన్ని ఇప్పటికీ బిగించనేలేదు. దీంతో విద్యార్థులు సమీప చేతిపంపు నుంచి క్యాన్‌లతో మంచినీరు తెచ్చుకుంటున్నారు. అనకాపల్లి పట్టణం భీమునిగుమ్మంలో ఉన్న అంబేడర్కర్ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 200పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి తరగతికి చెందిన విద్యార్థులు రోజూ సమీపంలోని ప్రైవేటు వాటర్ ప్లాంట్ నుంచి మంచినీటిని క్యాన్‌లతో మోసుకెళ్తుంటారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని నాటి వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆర్ఓ ప్లాంట్లు నాసిరకానివి కట్టబెట్టింది. దీంతో ఇవి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఫలితంగా విద్యార్థులకు తాగునీరు కరవవుతోంది. ఇప్పటికే చాలా పాఠశాలల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. ఎండలు పెరిగితే దాహంకేకలు ఎక్కువవుతాయి. అనకాపల్లి జిల్లాలో 344 పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 248 పాఠశాలలకు ప్లాంట్లు మంజూరయ్యాయి. ఇందులో 160పైగా పాఠశాలల్లో ప్లాంట్లు ఇప్పటికీ అమర్చలేదు. వాటిని బిగించేందుకు ఫిర్యాదు చేసినా.. ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని బాగుచేసినా.. కొన్నాళ్లకు మళ్లీ మరమ్మతుకు గురవడంతో మూలకు చేర్చారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 100 మంది విద్యార్థులు ఉంటే సరఫరా చేసిన ఆర్ఓ ప్లాంట్‌కు రూ. 24 వేల నుంచి రూ. 70 వేల వరకు వెచ్చించారు. 300 మంది విద్యార్థులలోపు ఉన్నత పాఠశాలలకు టైప్-3 కింద రూ. 1.84 లక్షలు, 300 నుంచి 500 మంది ఉన్న పాఠశాలలకు టైప్-4 కింద రూ. 4.8 లక్షల విలువ చేసే యంత్రాలు సరఫరా చేశారు. ఇందులో చాలావరకు ఇప్పటికీ బిగించనే లేదు. ఉపాధ్యాయులకు భారం.. మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లపై ప్రధానోపాధ్యాయులు ఫిర్యాదు చేసిన వారంలో బాగు చేయాలి. నిర్వాహకులు వచ్చి ఉచితంగానే మరమ్మతులు చేయించాల్సి ఉంది. అయిదేళ్లపాటు వాటి నిర్వహణకుగాను ఒప్పందం ఉంది. కానీ.. మరమ్మతులు చేసేందుకు యంత్రాల లోపల సామగ్రి దెబ్బతిందని, దూరం నుంచి వచ్చామంటూ ఉపాధ్యాయులను డబ్బులు అడుగుతున్నారు. తరచూ ప్లాంట్లు పాడైపోతుండటంతో సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాడైపోయిన శుద్ధజల యంత్రాలను బాగు చేయించి, విద్యార్థుల దాహార్తి తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వానికి నివేదించాం.. గత ప్రభుత్వంలో పాఠశాలలకు సరఫరా చేసిన శుద్ధజల యంత్రాల్లో కొన్ని ఇప్పటికీ బిగించని మాట వాస్తవమే. యంత్రాలు పనిచేయని వాటిని ఇప్పటికే గుర్తించాం. సంబంధిత కంపెనీకి చెప్పాం. యంత్రాలు అమర్చినప్పటి నుంచి ఐదేళ్ల వరకు ఆ కంపెనీలే వాటి నిర్వహణ బాధ్యత తీసుకోవాలి. ఈ సమస్యపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో సమస్య పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటాం.

# జర్నలిస్ట్ కోటేశ్వరావుకి MLA ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శ



నాయకులు కొఠారు వెంకట్రావు, పోచవరం గ్రామ టిడిపి అధ్యక్షులు నీరుకొండ రమేష్, సుబ్బు , వెంకటేష్ తదితరులు ఉన్నారు

తాళ్లపూడి మండలంలో జర్నలిస్టుగా సేవలందిస్తున్న ఉదయ అక్షరం రిపోర్టర్ గంటా శ్రీరామ కోటేశ్వరరావు కు మాతృ వియోగం జరిగింది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోటేశ్వర రావు తల్లి శుక్రవారం తుది శ్వాస విడిచారు. మరణ వార్త తెలుసుకున్న కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం కోటేశ్వర రావు నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించి ఆయన తల్లి గంటా రాజేశ్వరి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. ఎమ్మెల్యే తో పాటు టిడిపి సీనియర్

# 'స్వచ్ఛ ఆంధ్ర,స్వచ్ఛ రధం' వాహనాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు గారు



**తాళ్లపూడి మండలం అన్నదేవరపేట విశాఖ సమాచారం :ప్రతినిధి( శివ కృష్ణ ) :** ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో 'స్వచ్ఛ రథం' వాహనాన్ని ప్రారంభించిన కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు గారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను సమూలంగా తొలగించి తద్వారా ప్రజలకు పారిశుద్ధ్యం పై మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి తదనుగుణంగా గ్రామాలన్నీ స్వచ్ఛ గ్రామాలుగా ఉండాలనే సంకల్పంతో స్వచ్ఛ రదాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామాలలో ఉన్న ప్రజలు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను ప్రభుత్వం నిర్దేశించిన రేటుకు స్వచ్ఛ రథం వద్ద అందించి ఆ రేటుకు సమాన రీతిలో నిత్యఆవసరాలను పొందవలసిందిగా తెలియజేసారు.. ఈకార్యక్రమం వలన ప్రజలకు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ మరియు ఇతర వ్యర్థాల వలన ప్రత్యక్షంగా లబ్ధి చేకూరడమే కాకుండా గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంటాయని, ఈకార్యక్రమమునకు ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో కొటారు వెంకట్రావు గారు, కాకర్ల సత్యేంద్ర గారు, కూచిపూడి గణపతి గారు, కూచిపూడి లక్ష్మణ రావు గారు, ఇందుగుల రామకృష్ణ గారు, కూచిపూడి హనుమంతురావు గారు, చెవ్వూరి రాము గారు, అన్నమరెడ్డి రమణ గారు, దండమూడి శేషు గారు, నామా నరేంద్ర గారు, కోర్లపాటి దత్తుడు గారు, కైగాల శ్రీను గారు, అన్నమారెడ్డి సత్తిబాబు, అన్నమారెడ్డి సోమశేఖర్ గారు, తిగిరిపల్లి కనకరత్న గారు, మద్దూకూరి శంకరం గారు, ఉప్పులూరి రమేష్ గారు, దుగ్గిరాల జగదీశ్ గారు, కొప్పాక జోవహర్ గారు, ఎలుగుబంటి బాలకృష్ణ గారు, నీరుకొండ రమేష్ గారు, పాల చంద్రరావు గారు తదితర చీణూ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఏపీటీఎఫ్ చలో ఢిల్లీ ప్రచారం



**తాళ్లపూడి, విశాఖ సమాచారం :** విద్యాహక్కు చట్టాన్ని ఆధారంగా చేసుకొని సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ లో ఉత్తీర్ణులు కావాలనే నిబంధనను మార్పు చేయడానికి విద్యాహక్కు చట్టాన్ని సవరించాలని కోరుతూ ఎపీటీఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 10వ తేదీన ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమం గురించి తాళ్లపూడి మండలంలో వివిధ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షులు డి దుర్గారావు తెలిపారు. ఈ సందర్ ప్రక్కిలంక మెయిన్ పాఠశాల, తాళ్లపూడి స్పెషల్ పాఠశాలల్లో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల సాధనకై ఏపీటీఎఫ్ నిర్మాణాత్మక పాత్ర పోషించడంలో ముందుంటుందని అన్నారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు అందరూ సీనియారిటీతో సంబంధం లేకుండా, సర్వీసుతో సంబంధం లేకుండా టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలనడం సహేతుకం కాదు అన్నారు. ఏ ఉద్యోగ డిపార్ట్మెంట్ లో లేని నిబంధనలు ఉపాధ్యాయ వృత్తిలో పెట్టి ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేయడం మానుకోవాలన్నారు. ఈ సమస్యల సాధనకై ఏపీటీఎఫ్ దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చిందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో దుర్గారావుతో పాటు తాళ్లపూడి ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కొయ్య ప్రసాదరావు ఉన్నారు

# దేశంలో సమృద్ధిగా బంగారు గనులు



జీఎస్ఐ మాజీ డైరెక్టర్ జనరల్ ఎన్.కుటుంబరావు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖపట్నం, ఏయూ ప్రాంగణం: 'దేశంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మరికొన్ని ప్రాంతాల్లో బంగారు గనులు సమృద్ధిగా ఉన్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని వెలికి తీస్తున్నారు' అని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) మాజీ డైరెక్టర్ జనరల్ ఎన్.కుటుంబరావు పేర్కొన్నారు. ఇప్పటికే దేశంలో 98 శాతం భూభాగాన్ని జీఎస్ఐ జల్లెడపట్టిందన్నారు. ఎక్కడ ఏ రకమైన రాళ్లు ఉన్నాయి, వాటిల్లో ఏ ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయో గుర్తించిందన్నారు. హిమాలయాల్లో వెళ్లేందుకు అవకాశం లేని చోటే అన్వేషణ జరగలేదన్నారు. శుక్రవారం విశాఖలోని ఆంధ్రవిశ్వవిద్యాలయం జియాలజీ విభాగ పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరైన ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే.

టన్నుకు మూడు గ్రాములొచ్చినా: ఇప్పటి వరకు దేశంలో హైగ్రేడ్ బంగారం ఎక్కడ లభిస్తుందో అక్కడే తవ్వకాలు సాగాయి. ఇప్పుడు మీడియం గ్రేడ్ ప్రదేశాలను గుర్తిస్తున్నారు. ఒక టన్నులో అయిదు గ్రాముల బంగారం వస్తేనే గనుల్లో తవ్వకాలు జరిగేవి. ఇప్పుడు ఒక టన్నుకు మూడు గ్రాములొచ్చిన ప్రదేశాల్లోనూ జరుపుతున్నారు. తక్కువ గ్రేడ్ వస్తే సాంకేతికతను ఉపయోగించి ప్రాసెసింగ్ ఖర్చు తగ్గించుకుంటున్నారు. ఏపీలోని కర్నూలు జిల్లాలో బంగారు గనుల తవ్వకాలు త్వరలోనే ప్రారంభ మవుతాయి.

వేడి నీళ్లతో విద్యుత్తు: బొగ్గు గనులున్న కొన్ని చోట్ల అక్కడి భౌగోళిక పరిస్థితుల వల్ల తవ్వకాలు జరిపినప్పుడు వేడి నీళ్లు ఉబికి వస్తున్నాయి. ఈ నీళ్లతో జియో థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చు. దీనికి సంబంధించి జీఎస్ఐ ఆధ్వర్యంలో తెలంగాణలోని మణుగూరులో ప్రయోగాత్మక ప్రాజెక్టు చేపట్టాం. అక్కడ బొగ్గు గనుల నుంచి వస్తున్న వేడి నీళ్ల నుంచి విద్యుత్తు తయారు చేయొచ్చని గుర్తించి ఆ ప్రాజెక్టు నిర్వహణ మణుగూరు బొగ్గు గనుల కేంద్రానికే అప్పగించాం. త్వరలో అది ప్రారంభమవుతుంది. అలాగే హిమాలయాల్లో కొన్ని చోట్ల వేడి నీళ్ల ఊటబావులున్నాయి. అక్కడి నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చు.

ఉద్ధృతంగా ఖనిజాన్వేషణ: ఏపీ, ఒడిశా, తమిళనాడు, కేరళలో రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్ల ఏర్పాటుకు కేంద్రం ప్రతిపాదించడం మంచి నిర్ణయం. లిథియం, గ్రాఫైట్, కోబాల్ట్, మోనజైట్ బీచ్ శాండ్ నుంచి వచ్చే నియోడిమియం వంటి అరుదైన ఖనిజాలు ప్రాసెస్ చేసే సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతాయి. రేర్ ఎర్త్ మినరల్స్ గుర్తింపునకు జీఎస్ఐ అనేక ప్రాజెక్టులు చేపడుతుంది. గతంలో జియాలజిస్టులతో 250 ప్రాజెక్టులు చేయిస్తే నేడు 2 వేలకుపైగా చేయిస్తోంది. క్షేత్రస్థాయిలో ఖనిజాన్వేషణ ఉద్ధృతంగా నిర్వహిస్తోంది.

ఎన్ఎంఈడీటీతో: ఖనిజాన్వేషణపై ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్, డెవలప్‌మెంట్ ట్రస్టు (ఎన్ఎంఈడీటీ)కు దరఖాస్తు చేయవచ్చు. ఆయా ప్రాంతాల్లో ఖనిజాలపై పరిశోధన జరిపి అవి లభ్యమయ్యే అవకాశం ఉందని సమగ్ర ప్రాజెక్టు నివేదిక సమర్పిస్తే కేంద్రమే నిధులు అందిస్తుంది. ఉత్తర భారత విశ్వవిద్యాలయాలు, ఐఐటీల్లో జియాలజీ కోర్సు వైపు మొగ్గు చూపే వారి శాతం అధికంగా ఉంది.

# వైభవంగా ఉపమాకలో వెంకన్న వార్షిక కల్యాణం



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** అందరి నోటా గోవిందా అన్న పలుకే.. అందరి అడుగులు ఉపమాక వైపే.. అందరి చూపులు కలియుగ దైవం మీదనే.. అశేష భక్తజనం వెల్లువలా తరలిరాగా ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మూడు గంటలకు కొండపై నిజరూపానికి ప్రత్యేక పూజల తర్వాత భక్తులకు దర్శనాలు మొదలయ్యాయి. భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేయడం మేలు చేసింది. మొత్తం లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. మరోవైపు కొండమీదకు వెళ్లే మెట్లమార్గం ఇసుకవేస్తే రాలనంతగా మారింది. మధ్యాహ్నం ధ్వజారోహణ నిర్వహించారు. ధ్వజపటాన్ని ముందుగా తిరువీధుల్లో



కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలు తెస్తున్న హోం మంత్రి అనిత

ఊరేగించారు. ఆలయ ఆవరణ, పరిసరాల్లో ఎటుచూసినా జనసంద్రంగా మారింది. హోం మంత్రి వంగలపూడి అనిత ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఆలయానికి వచ్చిన ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులతో కలిసి ఆమె తిలకించారు. ఈ సందర్భంగా ఆమె పలువురు కళాకారులను సత్కరించారు. తిరుమల నుంచి వచ్చిన లడ్డూ ప్రసాదాల విక్రయాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి తితిదే రూ. 5.4 కోట్లు మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు.




## పెళ్లయిన మరుసటి రోజే రికార్డు సృష్టించిన విరోష్ జంట..



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మోస్ట్ రూమర్డ్ జంటగా గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. గీత గోవిందం సినిమాతో మొదలైన వీరి పరిచయం.. ఆ తర్వాత ప్రేమగా మారింది. అప్పటినుంచి మీడియా కంట పడకుండా జాగ్రత్త పడుతూ తమ బంధాన్ని కొనసాగిస్తూ వచ్చారు. కలిసి వెకేషన్ కి వెళ్లడం, కలిసి పండుగలను సెలబ్రేట్ చేసుకోవడం లాంటివి చేస్తూ వచ్చారు. అయితే విడివిడిగా ఫోటోలు షేర్ చేయడంతో వారిద్దరూ రిలేషన్ లో ఉన్నారనే విషయాన్ని.. వీరు షేర్ చేసిన ఫోటోల బ్యాక్ గ్రౌండ్ స్పష్టం చేసింది. ఉదయపూర్ ప్యాలెస్ సాక్షిగా ఒక్కటైనా విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న.. అయితే ఎప్పుడెప్పుడు వీరు తమ బంధం గురించి ఓపెన్ అవుతారా అని అభిమానులు వేయికళ్లతో ఎదురు చూశారు. కానీ ఎక్కడ కూడా ఆ విషయాన్ని బయట పెట్టలేదు. పైగా గతేడాది రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఇక దీంతో వీరి పెళ్లి వార్తలకు ఊపందుకుంది. ఇక ఎట్టకేలకు అభిమానులను సర్ప్రైజ్ చేస్తూ అభిమానులు ముద్దుగా పెట్టుకున్న “విరోష్“ అనే పదాన్ని స్వీకరించి.. “ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్“ అంటూ ప్రకటించారు. ఇక అన్నట్టుగానే ఉదయపూర్ లోని హై ప్రొఫైల్ ప్యాలెస్ లో హిందూ సాంప్రదాయం ప్రకారం ఉదయం 10:10 గంటలకు అత్యంత సన్నిహితులు కుటుంబ సభ్యుల మధ్య విజయ్ - రష్మిక ఏడడుగులు మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఇక అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు రష్మిక మందన్న మత ఆచారాల ప్రకారం కొడవ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. అలా రెండుసార్లు ఈ జంట వివాహం చేసుకోవడం జరిగింది. చాశ్రీంశీ =ఘుస - నయానిక - అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్.. ముఖ్య అతిథులు ఎవరంటే? 12 గంటల్లోనే ఊహించని రికార్డ్ సొంతం చేసుకున్న పెళ్లి ఫోటోలు.. ఇకపోతే వివాహం అనంతరం అటు విజయ్ దేవరకొండ రష్మిక మందన్న తమ అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతాల ద్వారా పెళ్లి ఫోటోలను షేర్ చేయగా .. షేర్ చేసిన 12 గంటల్లోనే ఇవి రికార్డు సృష్టించాయి. విజయ్ దేవరకొండ షేర్ చేసిన ఇన్స్టాగ్రామ్ పోస్ట్ కు ఏకంగా 12 గంటల్లోనే 12 మిలియన్ లైక్స్ రాగా.. రష్మిక పెట్టిన పోస్ట్ కి 14 మిలియన్ లైక్స్ వచ్చాయి. దీంతో ఈ పెళ్లి ఫోటోలకు కేవలం 12 గంటల్లోనే 2.6 కోట్ల లైక్స్ రావడం నిజంగా సంచలనం అనే చెప్పాలి. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. రిసెప్షన్ ఆరోజే.. మరోవైపు అతి తక్కువ సమయంలోనే ఈ స్థాయి రికార్డు క్రియేట్ చేయడానికి కారణం ఈ జంటకి ఉన్న క్రేజ్ అనే చెప్పాలి. గత ఎనిమిది సంవత్సరాలుగా అభిమానులకు, సెలబ్రిటీలకు ఎక్కడ తమ బంధాన్ని రివీల్ చేయకుండా ఉత్కంఠ రేపిన ఈ జంట.. ఎట్టకేలకు ఫోటోలు షేర్ చేయడంతో ఇక ఆ ఫోటోలు చూడడానికి చాలామంది ఆసక్తి కనబరిచారు. అదే ఇప్పుడు ఈ రికార్డ్స్ క్రియేట్ చేయడానికి కారణమైందని చెప్పాలి. ఇక మరొకవైపు హైదరాబాదులోని తాజ్ కృష్ణ హోటల్ విజయ్ , రష్మిక మందన్న రిసెప్షన్ మార్చి 4న జరగనుంది . ఈ కార్యక్రమానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.

## వారసుడు చిచ్చరపిడుగు నో డౌట్




ఎన్టీఆర్ తన వ్యక్తిగత జీవితాన్ని చాలా ప్రైవేట్‌గా ఉంచుతారు. కానీ తన కుమారులైన అభయ్ రామ్, భార్గవ్ రామ్‌లకు సంబంధించిన ఫోటోలు బయటకు వచ్చినప్పుడల్లా అవి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుంటాయి. ఎన్టీఆర్ మాస్ ఫ్యాన్స్ వీటిని వైరల్‌గా షేర్ చేయడంలో ఎప్పుడూ వెనక్కి తగ్గరు. ఎన్టీఆర్ ఇద్దరు కుమారులు నిజంగానే చిచ్చరపిడుగులు. వారి వయస్సు, చదువు వివరాలలోకి వెళితే.. పెద్ద కుమారుడు అభయ్ రామ్ 2014లో జన్మించాడు. ప్రస్తుతం తన వయస్సు సుమారు 11 ఏళ్లు. 6వ లేదా 7వ తరగతి చదువుతున్నాడు. భార్గవ్ రామ్ చిన్న కుమారుడు. ఈ బాలుడు 2018లో జన్మించాడు. ప్రస్తుతం తన వయస్సు 7 ఏళ్లు. 2వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఓక్రిడ్జ ఇంటర్నేషనల్ స్కూల్ లో చదువుతున్నారని సమాచారం.తాజాగా ఫ్యాన్ గ్రూప్స్ షేర్ చేసిన ఇన్‌స్టా లింక్‌లో చురుకైన భార్గవ్ రామ్ ఫోటో హైలైట్ గా కనిపిస్తోంది. ఈ ఫోటోను చూస్తుంటే, అది భార్గవ్ రామ్ స్కూల్ లో డ్రాయింగ్ కాంపిటీషన్ లో పాల్గొన్నప్పుడు తీసిన ఫోటోలా కనిపిస్తోంది. తన చేతిలో ఉన్న పెయింటింగ్ ని చూసారా? ఏనుగు బొమ్మను సాయంసంధ్యలో ఎంత అందంగా ఆవిష్కరించాడు? ఒక కళాకారుడి బిడ్డ అని నిరూపించాడు. అతడు అక్కడ ఆ బొమ్మను చూపిస్తూ నిలబడ్డ తీరు చూస్తుంటే భార్గవ్ లో కామిక్ కోణం కూడా బయటపడుతోంది. చాశ్రీంశీ =ఘుస - నయానిక - అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్.. ముఖ్య అతిథులు ఎవరంటే? సాధారణంగా ఎన్టీఆర్ భార్య ప్రణతి పిల్లల ఆలనాపాలనా, స్కూల్ యాక్టివిటీస్‌ను దగ్గరుండి చూసుకుంటారు. భార్గవ్ రామ్ అచ్చం తన తండ్రి పోలికలతో ముఖ్యంగా ఆ కళ్ళలో ఉన్న తీక్షణతతో తారక్ చిన్నప్పటి రోజులను గుర్తు చేస్తున్నాడని ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. కుమారులతో ఎన్టీఆర్ అనుబంధం ఎన్టీఆర్ ఎంత బిజీగా ఉన్నా పిల్లల కోసం సమయం కేటాయిస్తారు. షూటింగ్స్ లేనప్పుడు భార్య, పిల్లలతో కలిసి విదేశీ పర్యటనలకు వెళ్తుంటారు. పిల్లలకు మన సంప్రదాయాలు తెలియాలని ఇంట్లో జరిగే ప్రతి పూజలో వారిని కూర్చోబెడతారు. వారికి సంస్కృతిని అలవాటయ్యేలా సహకరిస్తున్నారు. తారక్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నా పిల్లలు నా లోకం.. వారితో గడిపితే నా ఒత్తిడి అంతా పోతుంది! అని పేర్కొన్నారు ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ప్రశాంత్ నీల్ ఇప్పటికే ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ కోసం ప్రశాంత్ నీల్ మోషన్ క్యాప్చర్ సాంకేతికతతో పాటు, అత్యాధునిక వీఎఫ్.ఎక్స్ వాడుతున్నారు. డ్రాగన్ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నా ఇంకా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని నీల్ బృందం ప్లాన్ చేస్తున్నారు. ఎన్టీఆర్ ఇందులో మునుపెన్నడూ చూడని విధంగా చాలా వైలెంట్ పాత్రలో కనిపిస్తారని, ప్రభాస్ -సలార్- కంటే భారీ యాక్షన్ సీన్లు ఇందులో ఉంటాయని టాక్.




## ఇషాన్ కిషాన్.. నీకు ఇదేం రోగం..?



టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్‌కు ఆఫ్ స్పిన్ బౌలింగ్ సవాల్‌గా మారింది. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్.. ఆఫ్ స్పిన్ బౌలర్లకు మాత్రం ఇబ్బంది పడుతున్నాడు. దాంతో ఇషాన్ కిషన్‌ను కట్టడి చేసేందుకు ప్రత్యర్థి జట్లు ఆఫ్ స్పిన్ బౌలర్లను అస్త్రంగా ఉపయోగిస్తున్నాయి. పవర్ ప్లేలోనే ఆఫ్ స్పిన్ బౌలర్లతో బౌలింగ్ చేయిస్తున్నాయి.

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఇషాన్ కిషన్.. 6 మ్యాచ్‌ల్లో ఐదు సార్లు ఆఫ్ స్పిన్నర్‌కే ఔటయ్యాడు. నమీబియాతో మ్యాచ్‌లో ఎరాస్మస్ బౌలింగ్‌లో.. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో సైమ్ అయూబ్ బౌలింగ్‌లో వెనుదిరిగిన ఇషాన్ కిషన్.. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ఆర్యన్ దత్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. సౌతాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో మార్క్‌రమ్ బౌలింగ్‌లో .. జింబాబ్వేతో మ్యాచ్‌లోనూ ఆఫ్ స్పిన్నర్ అయిన సికందర్ రజా బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. వెస్టిండీస్ తో మ్యాచ్ కు ముందు టీమిండియాలో.. !!వెస్టిండీస్ తో మ్యాచ్ కు ముందు టీమిండియాలో.. !! ఇటీవల ఇషాన్ కిషన్ మొత్తం 10 సార్లు ఆఫ్ స్పిన్నర్‌కు ఔటయ్యాడు. ఇతర బౌలర్లతో పోలిస్తే ఆఫ్ స్పిన్నర్లపై ఇషాన్ స్ట్రైక్ రేట్ తక్కువగా ఉంటోంది. ముఖ్యంగా బంతిని లోపలికి వేసే ఆఫ్ స్పిన్నర్ల బౌలింగ్‌లో ఇషాన్ డాట్ బాల్స్ ఎక్కువగా ఆడుతున్నాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లకు ఆఫ్ స్పిన్నర్లు సహజంగానే సవాలు విసురుతారు. ఇషాన్ కిషన్ ఎక్కువగా 'వైడ్ ఆఫ్ ది ఆఫ్ స్టంప్' వచ్చే బంతులను ఆడే క్రమంలో లేదా స్పిన్ అవుతున్న బంతిని డ్రైవ్ చేయబోయి క్యాచ్ ఇచ్చి ఔటవుతున్నాడు. ఐపీఎల్ కెరీర్‌లో కూడా ఇషాన్ కిషన్ ఆఫ్ స్పిన్నర్లకు 14 సార్లు ఔటయ్యాడు. దాంతోనే ఇషాన్‌కు చెక్ పెట్టేందుకు ప్రత్యర్థి జట్లు ఆఫ్ స్పిన్నర్లను బరిలోకి దించుతున్నాయి. ఇషాన్ కిషన్‌తో పాటు అభిషేక్ శర్మ కూడా లెఫ్టార్మ్ బ్యాటర్ కావడంతో ప్రత్యర్థి జట్లు తొలి ఓవర్‌ను కూడా ఆఫ్ స్పిన్నర్లతోనే వేయిస్తున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు టీమిండియా మేనేజ్‌మెంట్ కుడిచేతి వాటం బ్యాటర్ అయిన సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించింది. ఇషాన్ కిషన్ ఫస్ట్ డౌన్‌కు డిమోట్ చేసింది. ఈ వ్యూహాత్మక మార్పు ఫలించడంతో ఇదే ఫార్ములాను టీమిండియా కొనసాగించనుంది. ఇంగ్లాండ్‌ను గెలిపించింది బాబార్ ఆజామే..వాట్ ఏ ఇన్నింగ్స్..!!ఇంగ్లాండ్‌ను గెలిపించింది బాబార్ ఆజామే..వాట్ ఏ ఇన్నింగ్స్..!! అయితే ఇషాన్ కిషన్ వీలైనంత త్వరగా ఆఫ్ స్పిన్ బలహీనతను అధిగమించుకోవాలని, లేదంటే కష్టమవుతుందని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు. సాంకేతిక అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో ఆటగాళ్ల బలహీనతలను కనిపెట్టడం ప్రత్యర్థులకు కష్టం కాదని, వీలైనంత త్వరగా సమస్యను అధిగమించాలని సూచిస్తున్నారు. లేదంటే కెరీర్‌లో కొనసాగలేడని చెబుతున్నారు.

## పాక్ సెమీస్ చేరాలంటే?



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో మరో రసవత్తర మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. గ్రూప్-2లో భాగంగా శ్రీలంక, పాకిస్థాన్ తమ ఆఖరి సూపర్-8 మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. నేటి(శనివారం) రాత్రి కొలంబో వేదికగా ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. శ్రీలంకకు ఇది నామమాత్రపు మ్యాచ్ అయినా.. పాకిస్థాన్‌కు మాత్రం భవితవ్యం తేల్చే మ్యాచ్. ఇంగ్లండ్ చేతిలో న్యూజిలాండ్ అనూహ్య పరాజయం ఎదుర్కోవడంతో పాకిస్థాన్ సెమీస్ అవకాశాలు సజీవంగా ఉన్నాయి. గెలుపే కాదు.. అయితే శ్రీలంకతో గెలుపే పాకిస్థాన్‌కు సరిపోదు. రన్‌రేట్ మెరుగుపర్చుకోవడం కూడా పాకిస్థాన్‌కు కీలకం. న్యూజిలాండ్‌ను ఓడించిన ఇంగ్లండ్ హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8ను అజేయంగా ముగించి గ్రూప్-2 టాపర్‌గా సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. రెండో బెర్త్ కోసం పాకిస్థాన్, న్యూజిలాండ్ పోటీపడుతున్నాయి. న్యూజిలాండ్ 3 మ్యాచ్‌ల్లో ఒకటి గెలిచి ఒకటి ఓడి.. మరో మ్యాచ్ రద్దవ్వడంతో 3 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు పాకిస్థాన్ 2 మ్యాచ్‌ల్లో ఒకటి ఓడి.. మరో మ్యాచ్ రద్దవ్వడంతో ఒక పాయింట్‌తో మూడో స్థానంలో ఉండగా.. శ్రీలంక రెండుకు రెండు మ్యాచ్‌లు ఓడి సెమీస్ రేసు నుంచి తప్పుకుంది. శ్రీలంకతో తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ గెలిచినా సరిపోదు. ఎందుకంటే పాకిస్థాన్(-0.461) కంటే న్యూజిలాండ్(1.390) రన్‌రేట్ మెరుగ్గా ఉంది. ఛేజింగ్, టార్గెట్ లెక్క ఇదే.. శ్రీలంకతో మ్యాచ్‌లో పాకిస్థాన్ ముందుగా బ్యాటింగ్ చేస్తే 65 పరుగుల భారీ తేడాతో గెలవాలి. లేదంటే 13 ఓవర్లలోనే శ్రీలంక విధించిన లక్ష్యాన్ని ఛేదించాలి. అప్పుడే న్యూజిలాండ్ రన్‌రేట్‌ను పాకిస్థాన్ అధిగమించవచ్చు. ఇలా జరగకుండా గెలిచినా పాకిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తోంది. న్యూజిలాండ్‌కు సెమీస్ బెర్త్ దక్కుతుంది.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com